


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 238, పేజీలు - 08
శుక్రవారం, ఫిబ్రవరి 13, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు
# సర్వం సిద్ధం



### ఫలితాలపై పార్టీల్లో ఉత్కంఠ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. రేపు (ఫిబ్రవరి 13, 2026) ఉదయం 8 గంటలకు నిర్దేశిత కేంద్రాల్లో లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం అవసరమైన సూపర్ వైజర్లు, అసిస్టెంట్లను ఇప్పటికే నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రాల పరిసరాల్లో బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 (నిషేధాజ్ఞలు) అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. కౌంటింగ్ హాల్ లోపలికి కేవలం సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఎలక్షన్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. వీరందరూ తప్పనిసరిగా జారీ చేసిన పాసులు కలిగి ఉండాలి. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి అనుమతించరు. పారదర్శకత కోసం అన్ని కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఇటీవల ముగిసిన ఈ ఎన్నికల్లో 73.01 శాతానికి పైగా పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే.

### కౌంటింగ్ ప్రాసెస్ ఇలా..

ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టి, అది పూర్తయ్యాక సాధారణ బ్యాలెట్

2లో..

## రాహుల్ గాంధీ లోక్ సభ
## సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**- సభలో ఎంపీ నోటీసు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే. రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ

2లో..

## తెలంగాణకు నేనే రాజు..
# నేనే మంత్రి
## ఢిల్లీలో రేవంత్ చిట్ చాట్

**- పదిన్నరేళ్లు నేనే సీఎం అన్న రేవంత్ రెడ్డి - నాకు పోటీ ఎవరూ లేరన్న సీఎం**
**- 2029లో జమిలీ ఎన్నికలు జారుతాయని జోస్యం - కేసీఆర్ అరెస్ట్ పై కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో తనకు ఎదురులేదని రాష్ట్రానికి నేనే రాజు.. నేనే మంత్రిని నాకు ఎవరూ పోటీ కాదు అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన జాతీయ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గంటన్నర పాటు సాగిన ఈ భేటీలో ఆయన పాలన, భవిష్యత్తు రాజకీయాలు మరియు జమిలి ఎన్నికలపై అత్యంత ధీమాతో చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. వచ్చే పదిన్నర ఏళ్ల పాటు ముఖ్యమంత్రి పీఠంపై తానే ఉంటానని, పాలనలో తన ముద్రను మరింత బలంగా వేస్తానని ధీమా వ్యక్తం చేశారు. పదిన్నరేళ్ల లెక్క ఏమిటంటే వచ్చే ఎన్నికలు 2028లో జరగబోవని

2లో..

## మాదాపూర్‌లో
## బిగ్ ఆపరేషన్

**- రూ. 2,200 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాకోరులపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా మాదాపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రూ.2,200 కోట్ల విలువైన 11 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, మొండికుంట చెరువు సమీపంలో ఆక్రమణలపై స్థానికుల

2లో..

## కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు
# నిరూపిస్తే ఏ చర్చకైనా సిద్ధం



- పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ
- విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న మంత్రి లోకేశ్
- విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ
- ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు

అమరావతి (ప్రశ్న న్యూస్) "నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.

### మండలిలో భూ కేటాయింపులపై వాడీవేడి చర్చ

శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు,

2లో..

## అందుకే ఆ పెద్దమనిషి
## అధికారాన్ని కోల్పోయారు

**- కేసీఆర్‌పై కవిత పరోక్ష విమర్శలు**

- బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయన్న కవిత
- తెలంగాణ వచ్చినా ఉద్యమకారుల కుటుంబాలకు అన్యాయం జరిగింది
- బడ్జెట్ లో ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్
- త్వరలోనే కొత్త రాజకీయా పార్టీ పెడతామని వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సభలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్ పాలనలోని లోపాలను ఎత్తిచూపుతూనే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సభ ప్రారంభంలో కవిత తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్మరణార్థం

2లో..

## చట్ట సభల్లో ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు
# ప్రభుత్వం కుట్ర



**- వైసీపీఎల్పీ సమావేశంలో జగన్ నిర్ణయం**

అమరావతి (ప్రశ్న న్యూస్) అసెంబ్లీ, శాసనమండలి బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ ప్రజాప్రతినిధులతో కీలక భేటీ నిర్వహించారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభలో ఏకైక ప్రతిపక్షంగా తమ పార్టీ ఉన్నా, ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. అసెంబ్లీలో సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ, శాసనమండలిలో పార్టీకి మంచి

2లో..

## లిక్కర్ స్కామ్‌కు
## అసలు ఆర్కిటెక్ట్ రాజ్ కేసిరెడ్డే

**- బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ**

న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కేసీరెడ్డి కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గురువారం జరిగిన విచారణలో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడమే కాకుండా నిందితుడిపై అత్యంత



2లో..

## మేడారం జాతర హుండీల లెక్కింపు పూర్తి

**- రూ.13,25,83,269 ఆదాయం వచ్చినట్లు అధికారుల వెల్లడి**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత ఘనంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జాతర సమయంలో ఏర్పాటుచేసిన హుండీలలో అమ్మవార్లకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించే ప్రక్రియ వారం రోజులపాటు కొనసాగింది. ఈనెల 5వ తేదీ నుంచి హన్మకొండలోని టిటిడి కళ్యాణమండపంలో నిర్వహించిన లెక్కింపు ప్రక్రియలో మొత్తం ఎనిమిది



2లో..

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ

**- కేంద్రమంత్రులతో వరుస భేటీలు**

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. ఈ క్రమంలోనే పలువురు కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై చర్చిస్తున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లను కలిశారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుతో సమావేశం అయ్యారు.



2లో..

# కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

### విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

### ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

### హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం

విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

### ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

### విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

### ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు.

భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## చట్ట సభల్లో ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు ప్రభుత్వం కుట్ర

బలం ఉందని, అక్కడ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని సభ్యులకు సూచించారు. సబ్జెక్టుల వారీగా పూర్తి అవగాహన పెంచుకుని, ఆధారాలతో సహా పోరాడాలని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, పదవులు ఉంటాయని భరోసా ఇచ్చారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా అబద్ధాన్ని సృష్టించి ప్రచారం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. కల్తీ నెయ్యి సరఫరాకు, తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాతే నాణ్యత లేని నెయ్యి ట్యాంకర్లు టీటీడీకి వచ్చాయని, ఈ విషయమై సీబీఐ ఛార్జిషీటులో పేర్కొన్న అంశాలకు సమాధానం చెప్పాల్సింది ఆయనేనని డిమాండ్ చేశారు. పరీక్షల్లో విఫలమై వెనక్కి పంపిన ట్యాంకర్లు, తిరిగి వేరే డెయిరీ పేరుతో టీటీడీలోకి ఎలా వచ్చాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. లడ్డూ వ్యవహారంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే తమ పార్టీ నేతల ఇళ్లపై దాడులు, అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలన అంతా కుంభకోణాలతో నిండిపోయిందని, రాష్ట్రంలో అవినీతి యథేచ్ఛగా సాగుతోందని జగన్ ఆరోపించారు. విశాఖపట్నంలో రూ.5 వేల కోట్ల విలువైన 54 ఎకరాల భూమిని చంద్రబాబు నిబంధనలకు విరుద్ధంగా తన బంధువులకు చెందిన గీతమ్ విద్యాసంస్థలకు కట్టబెట్టారని విమర్శించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇలా బరితెగించి బంధువులకు ఆస్తులు దోచిపెట్టలేదని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'క్యాష్.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్' అనే నినాదం వినిపిస్తోందని ఎద్దేవా చేశారు. భూముల పందేరం, ప్రభుత్వ వైఫల్యాలను మండలి వేదికగా గట్టిగా ఎండగట్టాలని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.

## లిక్కర్ స్కామ్‌కు అసలు ఆర్కిటెక్ట్ రాజ్ కేసిరెడ్డే

కఠినమైన వ్యాఖ్యలు చేసింది.

### లిక్కర్ స్కామ్‌కు అసలు ఆర్కిటెక్ట్

బెయిల్ పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం రాజ్ కేసీరెడ్డిని ఈ మొత్తం మద్యం కుంభకోణానికి అసలు ఆర్కిటెక్ట్ అని అభివర్ణించింది. ప్రభుత్వ వ్యవస్థలను మేనేజ్ చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరును కోర్టు తప్పుబట్టింది. ఈ కుంభకోణంలో ఆయన పాత్ర అత్యంత కీలకమని, అందుకే ఇప్పుడు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. రాజ్ కేసీరెడ్డి తరపు లాయర్ వాదనలు వినిపిస్తూ, తన క్లయింట్ ఇప్పటికే 10 నెలలుగా జైల్లో ఉన్నారని, కాబట్టి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై ధర్మాసనం ఘాటుగా స్పందించింది. పర్లేదు.. కొన్నాళ్లు జైల్లోనే ఉండనీయండి అని సంచలన వ్యాఖ్యలు చేసింది. జరిగిన కుంభకోణం తీవ్రత దృష్ట్యా మరికొంత కాలం ఆయన జైలులోనే ఉండాలని కోర్టు అభిప్రాయపడింది.

### పిటిషన్ ఉపసంహరణ

ధర్మాసనం బెయిల్ ఇచ్చేందుకు సముఖంగా లేకపోవడంతో పాటు, పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని సంకేతాలు ఇవ్వడంతో రాజ్ కేసీరెడ్డి తరపు న్యాయవాదులు వెనక్కి తగ్గారు. కోర్టు పిటిషన్‌ను కొట్టివేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతో, వారు తమ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు .

గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీ పేరుతో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఏపీ సీఐడీ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. రాజ్ కేసీరెడ్డి ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొట్టారని అభియోగాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలతో ఈ కేసులో విచారణ మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

### కొనసాగుతున్న ఈడీ విచారణ

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో సిట్ 16 మందిని అరెస్టు చేయగా, మొత్తం 48 మందిపై కేసులు నమోదు చేసింది. వీరిలో ప్రధాన నిందితుడు రాజ్ కేసీరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి వంటి ప్రముఖులు ఉన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి వంటి వారికి బెయిల్ వచ్చింది. మనీ లాండరింగ్ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేసిన ఈడీ, ఇప్పటికే ఎంపీ మిథున్ రెడ్డిని సుదీర్ఘంగా ప్రశ్నించింది. జనవరి 2026లో మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి కూడా నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. హవాలా మార్గంలో మళ్లించిన నిధులు, షెల్ కంపెనీల ఏర్పాటుపై ఈడీ ప్రస్తుతం లోతుగా ఆరా తీస్తోంది.

## మేడారం జాతర హుండీల లెక్కింపు పూర్తి

వందల ఇరవై ఎనిమిది హుండీలను తెరిచి అమ్మవారికి భక్తులు సమర్పించిన నగదును, ఆభరణాలను, కానుకలను లెక్కించారు. నిన్నటితో హుండీల లెక్కింపు ప్రక్రియ ముగియగా మొత్తం 13 కోట్ల 25 లక్షల 83 వేల 269 రూపాయల ఆదాయం 2026 మేడారం మహా జాతరలో వచ్చినట్టు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.

హుండీలలో నగదు తో పాటు విదేశీ కరెన్సీ, బంగారం, వెండి ఆభరణాలు, రద్దు అయిన నోట్లు కూడా ఉన్నట్టు పేర్కొన్నారు. 2024 మేడారం మహా జాతరలో మొత్తం 540 హుండీలను ఏర్పాటు చేయగా 13 కోట్ల 25 లక్షల 22 వేల 511 రూపాయల ఆదాయం వచ్చింది. అయితే ఈసారి 828 హుండీలను ఏర్పాటు చేశారు. ఆదాయం భారీగా వస్తుందని అంచనా వేశారు. మేడారం మహా జాతరకు గతంలో ఎరుగని విధంగా భారీగా ఖర్చు కూడా పెట్టారు. గతంతో పోల్చుకుంటే అధిక సంఖ్యలో భక్తులు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు.

అయినప్పటికీ మేడారం మహా జాతర ఆదాయం పెరుగుదల పరిమితంగానే ఉండడం, కేవలం వేల రూపాయలు మాత్రమే తేడా రావడం ప్రధానంగా కనిపిస్తుంది. మేడారం మహా జాతరలో వచ్చిన ఆదాయంలో 1/3 ఆదాయాన్ని సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు ఆలయ పూజారులకు పంచుతారు. అమ్మవార్ల వద్ద, పగిడిద్దరాజు, గోవిందరాజుల వద్ద ఏర్పాటు చేసిన హుండీలను విడివిడిగా లెక్కించి వచ్చిన ఆదాయంలో నుంచి 33 శాతం ఆదాయాన్ని ఆలయ పూజారులకు ఇస్తారు. మిగిలిన ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధికి, నిర్వహణకు ఖర్చు చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకులో జమ చేసి అవసరాన్ని బట్టి ఆలయ అభివృద్ధికి, నిర్వహణకు ఈ నిధులను వెచ్చిస్తారు.

## అందుకే ఆ పెద్దమనిషి అధికారాన్ని కోల్పోయారు

ఉద్యమకారులందరితో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అసలు సిసలు ఉద్యమకారులు ఆత్మగౌరవం కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

### కేసీఆర్ హయాంపై సంచలన వ్యాఖ్యలు

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన పరిణామాలపై కవిత తొలిసారిగా పరోక్షంగా విమర్శలు గుప్పించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యమకారులకు సహాయం చేయాలని కోరితే, అసలు ఉద్యమకారులు ఎవరు అని అధికారులు అడిగే దుస్థితి ఉండేది అని ఆమె వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమకారుడు నాగులు అసెంబ్లీ ముందే ఆత్మహత్య చేసుకున్నా కేసీఆర్ పట్టించుకోలేదని, ఉద్యమకారులంటే ఎవరో మనకు మనమే చెప్పుకోవాల్సిన పరిస్థితి నాటి ప్రభుత్వంలో ఉండేదని ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి.

### రేవంత్ రెడ్డికి బంగ్లా హెచ్చరిక

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఉద్యమకారుల ఆకాంక్షలను వెంటనే నెరవేర్చండి. ఆ పెద్దమనిషి ఉద్యమకారులను పట్టించుకోనందుకే అధికారాన్ని కోల్పోయారు. మీరు కూడా అదే తప్పు చేస్తే, ఉద్యమకారులు మిమ్మల్ని బంగ్లా బయటకు గుంజుతారు అని ఘాటుగా హెచ్చరించారు. ఉద్యమకారులకు పెన్షన్లు, గౌరవ వేతనాలు , నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమం 1995లోనే వరంగల్ డిక్లరేషన్‌తో ఉద్యమం మొదలైందని కవిత అన్నారు. మారోజు వీరన్న, గద్దర్ లాంటి ఎంతోమంది విప్లవకారులు, ప్రజాసంఘాల నాయకులు మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారుని అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారులకు ప్రభుత్వ పరంగా అండగా నిలవాలని తాను గతంలో ప్రయత్నించిన విషయాన్ని కవిత ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడిన వారికే నేడు గుర్తింపు కరువైందనే ఆవేదన సభలో వ్యక్తమైంది.

### రాజకీయ అస్తిత్వం కోసమేనా.?

తెలంగాణ జాగృతిని తిరిగి యాక్టివ్ చేస్తూ, సొంత తండ్రి పాలనను విమర్శించడం ద్వారా కవిత తన స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు భావిస్తున్నారు. ఉద్యమకారుల ఓటు బ్యాంకును ఆకర్షించడంతో పాటు, గత ప్రభుత్వ వైఫల్యాలను సొంత గొంతుకతోనే అంగీకరించడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత పొందే ప్రయత్నంగా ఈ సభ కనిపిస్తోంది. గతంలో ఆమె ఉద్యమకారులకు క్షమాపణలు చెప్పారు. వారి కష్టాలకు కన్నీరు పెట్టుకున్నారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ

తెలంగాణలోని ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనులకు సంబంధించి పలు విజ్ఞప్తులు చేశారు. త్వరలోనే తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. ప్రస్తుత ఢిల్లీ టూర్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల గురించి.. కేంద్రమంత్రులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు?తో సమావేశం అయిన రేవంత్ రెడ్డి వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు కోసం భూ సేకరణ ప్రక్రియ పూర్తి అయిందని విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి పాల్వంచలో స్థలం గుర్తించినట్లు వివరించారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజుబిలిటీ స్టడీని పాల్వంచలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం విమానాశ్రయ నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలం గుర్తించామని ఈ నేపథ్యంలోనే వెంటనే దానికి అనుమతులు మంజూరు చేయాలని రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి వినతిపత్రం అందించారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి అదనంగా మరో 249.82 ఎకరాల భూమిని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అంతకుముందు గురువారం ఉదయం ఢిల్లీలో కేంద్రమంత్రి రాజ్?నాథ్?సింగ్?తో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి పలు అంశాలపై చర్చించారు. ఈ నెలాఖరులో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని రాజ్‌నాథ్ సింగ్‌ను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో నిర్మిస్తున్న ఈ గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన విశేషాలను వివరించారు. 1948 ఫిబ్రవరిలో మహాత్మాగాంధీ చితాభస్మాన్ని ఆ ప్రాంతంలోనే నిమజ్జనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా ఈ గాంధీ సరోవర్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. మరోవైపు బాపూ ఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్యా, టెక్నాలజీ, ఆధ్యాత్మిక, పర్యావరణాలకు గుర్తుగా రూపొందించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, కొత్త రైల్వే లైన్లు గురించి వివరించారు. ఢిల్లీలో కేంద్రమంత్రులతో సమావేశం సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి అందించారు.

## పల్నాడులో ఇంటర్ పరీక్షలకు 49 పరీక్ష కేంద్రాలు

**- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి లీలావతి వెల్లడి**

**నరసరావుపేట** పల్నాడు జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి లీలావతి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. మొత్తం 814 మంది ఇన్విజిలేటర్లను నియమించి పర్యవేక్షణ కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

బాక్సులను తెరుస్తారు. వార్డులవారీగా బ్యాలెట్ బాక్సులను టేబుల్ వద్దకు తీసుకువచ్చి, ఒక్కో పోలింగ్ స్టేషన్ ఓట్లను 25 చొప్పున కట్టలుగా కడతారు. మిగిలిన చిల్లర ఓట్లను (25 కంటే తక్కువ ఉంటే) విడిగా ఉంచి స్లిప్ అంటిస్తారు. ఆయా పోలింగ్ స్టేషన్ల వివరాలు నమోదు చేసిన తర్వాత, వార్డులోని అన్ని బ్యాలెట్ కట్టలను ఒక పెద్ద డ్రమ్ములో వేసి బాగా కలుపుతారు. దీనివల్ల ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయో తెలియకుండా గోప్యత పాటించవచ్చు. అసంపూర్తిగా ఉన్న కట్టలను సాధ్యమైనంత వరకు కలిపి పూర్తి కట్టలుగా మారుస్తారు. మిగిలిన చిల్లర ఓట్లను విడిగా ఉంచి లెక్క రాస్తారు. ఈ ప్రక్రియను ప్రతి వార్డుకూ ఇదే రీతిలో అనుసరిస్తారు. బ్యాలెట్లను బాగా కలిపిన తర్వాత అసలు లెక్కింపు మొదలవుతుంది. ప్రతి రౌండ్‌లో డ్రమ్ము నుంచి యాదృచ్ఛికంగా 1000 ఓట్లను (40 కట్టలు) తీసి కౌంటింగ్ టేబుళ్లకు పంపిస్తారు. అక్కడ అభ్యర్థులు, నోటా, సందేహాస్పద ఓట్ల కోసం వేర్వేరు గదులున్న చెక్క ట్రేలను ఉపయోగిస్తారు. ప్రతి ఓటును ఏజెంట్లకు చూపిస్తూ దాని చెల్లుబాటును నిర్ధారించి, సంబంధిత అభ్యర్థి ట్రేలో వేస్తారు. అభ్యర్థుల వారీగా వచ్చిన చెల్లుబాటయ్యే ఓట్లను 100 చొప్పున కట్టలుగా కడతారు. అలాగే నోటా, సందేహాస్పద ఓట్లను కూడా 100 చొప్పున బండిల్ చేస్తారు. వందకు తక్కువగా ఉన్న ఓట్లను విడిగా ఉంచి ఆ సంఖ్యను స్లిప్ పై రాస్తారు. సందేహాస్పద ఓట్లపై రిటర్నింగ్ అధికారి (ఆర్.ఓ) తుది నిర్ణయం తీసుకుంటారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ నెలకొంది. ప్రతి వార్డును కూడా సవాల్ గా తీసుకోగా మెజార్టీ స్థానాలు గెలిచిన పార్టీలు ఆయా మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంటాయి.

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

## మాదాపూర్‌లో బిగ్ ఆపరేషన్

నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన హైడ్రా ఈ మేరకు ఇవాళ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఇటీవల జూబ్లీహిల్స్ ప్రాంతంలో రూ.3 కోట్ల విలువైన పార్కు స్థలం స్వాధీనంతో పాటుగా అక్రమంగా నిర్మించిన భవనాన్ని హైడ్రా కూల్చి వేసిన విషయం తెలిసిందే. అలాగే మరో ఘటనలో.. హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని ఖానామెట్ లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. అయితే తాజాగా మరోసారి హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. మాదాపూర్ లో ఈ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ లో భాగంగా వందలాది తాత్కాలిక షెడ్లు అలాగే 30 కు పైగా షాపులను అధికారులు తొలగించారు. మొండికుంట చెరువు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించి, 11 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. హైడ్రా రక్షించిన ఆస్తి విలువ సుమారు రూ. 2 వేల 200 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, మొండికుంట చెరువు సమీపంలో ఆక్రమణలపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఈ భారీ ఆపరేషన్ చేపట్టారు. హైడ్రా అధికారులు నిర్వహించిన ఈ ఆపరేషన్ లో భాగంగా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన మెకానిక్ షెడ్లు, ఐరన్ స్టీల్ దుకాణాలతోపాటు ఇతర నిర్మాణాలను కూల్చేశారు. ఇక కబ్జా దారులకు ముందస్తు సమాచారం, గడువు ఇచ్చిన తరువాతే చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఆక్రమణలు తొలగించిన ఈ ప్రభుత్వ భూమిలో పార్కుల ఏర్పాటు, చెరువు సుందరీకరణ చేయాలని స్థానికులు అధికారులను కోరారు. ఇక హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ను తెలంగాణ ప్రభుత్వం జులై, 2024 లో ఏర్పాటు చేసింది.

## తెలంగాణకు నేనే రాజు..నేనే మంత్రి

2029లో జమిలీగానే జరుగుతాయని అప్పటి వరకూ తానే సీఎంగా ఉంటానని చెబుతున్నారు. ప్రత్యర్థి పార్టీల విమర్శలను కొట్టిపారేస్తూ, తన నాయకత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని తేల్చి చెప్పారు. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న జమిలి ఎన్నికలపై రేవంత్ రెడ్డి కీలక విశ్లేషణ చేశారు. 2029లో జమిలి ఎన్నికలు రావడం ఖాయమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, అంతకంటే ముందు దేశంలో జనగణన , నియోజకవర్గాల పునర్విభజన , పార్లమెంట్ సీట్ల పెంపు ,మహిళా రిజర్వేషన్ల అమలు వంటి కీలక ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉంటుందని వివరించారు. ఈ పరిణామాలన్నీ ముగిసిన తర్వాతే దేశం ఒకే సారి ఎన్నికలకు వెళ్తుందని ఆయన విశ్లేషించారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ఇది రాజకీయ సమీకరణాలను మారుస్తుందని రేవంత్ పేర్కొన్నారు. సీట్ల పెంపు తర్వాత వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతామని, అదే సమయంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారకరామారావుపై రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ జాతి ఆస్తి, ఆయన ఎవరో ఒకరి సొత్తు కాదు ఆయనొక నేషనల్ లీడర్" అని అభివర్ణించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే, పార్లమెంటులో ఆయన విగ్రహాన్ని పెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రస్తుతం స్వయం ప్రకటిత గృహ నిర్బంధంలో ఉన్నారని ఎద్దేవా చేసిన రేవంత్, తాను ఎవరి ఫోన్లను ట్యాప్ చేయడం లేదని, ఇతరుల వ్యక్తిగత విషయాలు వినడం మానసిక క్షోభ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై సీఎం రేవంత్ స్పష్టమైన టైమ్ లైన్ ప్రకటించారు. మార్చి 31 లోపు హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం టేకోవర్ చేసే ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. అలాగే, జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ మరియు వరంగల్ విమానాశ్రయాలకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించడం ద్వారా ఉత్తర తెలంగాణ అభివృద్ధిపై తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. సింగరేణి సమస్యలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఒక రోజంతా చర్చ జరిపి అన్ని విషయాలను బహిర్గతం చేస్తామని చెప్పారు. ఇక ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రమాదంపై వస్తున్న ప్రచారాన్ని కొట్టిపారేస్తూ, అనాలసిస్ పూర్తయ్యాక అక్కడ ఆధారాలు ఉండవని సాంకేతిక అంశాన్ని వివరించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీపై ఆంధ్రప్రదేశ్ వైఖరిని రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఇప్పుడు ఏపీ ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటా ఇచ్చి ఏపీ ప్రాజెక్టులు కట్టుకుంటే మాకు అభ్యంతరం లేదు అని చెబుతూనే, నికర జలాల లెక్కల ప్రకారం తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని సూచించారు. రెండు రాష్ట్రాల్లో ప్రాజెక్టుల నిర్మాణానికి ఒకే విధానం ఉండాలని కోరారు. అలాగే మహబూబ్ నగర్ హత్యారాజకీయాల ఆరోపణలను తోసిపుచ్చుతూ, ఒక కౌన్సిలర్ కోసం అటువంటి పనులు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎవరినైనా జైల్లో వేయాలనుకుంటే తాము చట్టప్రకారం, నిబంధనలకు లోబడే ముందుకు వెళ్తామని, రాజ్యాంగం ప్రకారమే తన నడక ఉంటుందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం తొలి అంకానికి చేరిందని, విదేశాల నుంచి ప్రభాకర్ రావును తీసుకురావడానికి 20 నెలలు పట్టిందని, ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగానే పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై స్పందిస్తూ, కేవలం కుంగిన మూడు గేట్లే కాకుండా మొత్తం ప్రాజెక్టును అధ్యయనం చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిందని, నిపుణుల కమిటీ నివేదిక రాకుండా కేసీఆర్, హరీష్ రావు కోరినట్లు తాము తొందరపడి నిర్ణయాలు తీసుకోమని రేవంత్ తేల్చి చెప్పారు. ఫార్ములా రేస్ కేసులో మనీ లాండరింగ్ కోణంలో ఈడీ ఎందుకు స్పందించడం లేదని, సోనియా, రాహుల్ గాంధీలను విచారించిన ఈడీ కేటీఆర్ విషయంలో ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. దేశంలో ఎన్నికల సంస్కరణలపై రేవంత్ రెడ్డి కీలక విశ్లేషణ చేశారు. 2029లో జమిలి ఎన్నికలు జరగడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. దీనికి సంబంధించి ఒక కాలక్రమ పట్టికను కూడా ఆయన వివరించారు. 2027 మే లేదా జూన్ నాటికి జనాభా లెక్కలు తేలుతాయని, 2028 నాటికి మహిళా రిజర్వేషన్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేశారు. ఇక పార్టీ పరంగా కేబినెట్ విస్తరణపై అధిష్టానంతో చర్చించలేదని క్లారిటీ ఇచ్చారు.

## నంది హిల్స్‌లో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

**- పలు సమస్యలు గుర్తింపు. - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.**

**వనపర్తి.** వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు. వనపర్తి శాసనసభ్యులుతూడి మేఘారెడ్డిగురువారం వనపర్తి పట్టణంలోని నంది హిల్స్ 30 వ వార్డులో మార్నింగ్ వాక్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీవాసులతో కలిసి నడక సాగించారునంది హిల్స్ పార్కులో నిర్మిస్తున్న సామూహిక భవన నిర్మాణ పనులను పరిశీలించారు .టిఎంఆర్ స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలోని రోడ్ల వెంట నడక సాగించిన ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. కరెంటు స్తంభాలు, వీధిలైట్ల ఏర్పాటు, మురికి కాలువలను నిర్మాణం లాంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి కాలనీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. వనపర్తి లో రాజకీయాలకి అతీతంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, పట్టణాభివృద్ధిలో రాజకీయాలు ఒక చిన్న భాగమే తప్ప అభివృద్ధికి ఆటంకాలు కాకూడదన్న సంకల్పంతో ముందుకెళుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు స్థానిక పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల నష్టపరిహారం

**విజయవాడ** అమెరికాలో 2023లో రోడ్డు దాటుతున్న టైంలో తెలుగు అమ్మాయి జాహ్నవి కందులను పోలీస్ వాహనం ఢీ కొట్టింది. 23 ఏళ్ల అమ్మాయి ఉన్నత చదువుల కోసం యూఎస్ వెళ్లి ఇలా మృతి చెందడం అందర్నీగ్భ్రాంతికి గురి చేసింది. ఈ కేసులో ఇన్ని రోజుల విచారణ తర్వాత అమెరికాలోని సియాటిల్ సిటీ 29 మిలియన్ డాలర్ల అంటే సుమారు ?262 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఆ డబ్బులను జాహ్నవి ఫ్యామిలీకి అందజేయనున్నారు. దీంతో ఈ కేసు ఇప్పుడు చట్టపరమైన పరిష్కారానికి చేరుకుంది.జాహ్నవి కందుల మరణం చాలా విషాదకరం. ఈ ఆర్థిక పరిష్కారం జాహ్నవి కుటుంబానికి కొంత ఓదార్పునిస్తుందని సియాటిల్ సిటీ ఆశిస్తోంది. ఆమె కుటుంబానికి, స్నేహితులకు, సమాజానికి ఆమె చాలా ముఖ్యం" అని సిటీ న్యాయవాది ఎరికా ఎవాన్స్ ఒక ప్రకటనలో తెలిపారు.పోలీస్ ఆఫీసర్ కెవిన్ దేవ్ వేగంగా వాహనం నడుపడం వల్లే జాహ్నవి ప్రాణాలు కోల్పోయింది. అతను దాదాపు 119 కి.మీ/గం వేగంతో ప్రయాణిస్తున్నాడు. కానీ ఆ ప్రాంతంలో వేగ పరిమితి దాదాపు 40 కి.మీ/గం. ప్రమాదం జరిగిన తర్వాత ఆమె 138 అడుగుల దూరంలో పడి స్పాట్‌లోనే చనిపోయింది. ప్రమాదం జరిగిన తర్వాత పోలీసులు ప్రవర్తించిన తీరుతో ఈ కేసులో సంచలనంగా మారింది. పోలీసు అధికారి బాడీ కెమెరాలో రికార్డు అయిన ఆడియో బయటకు రావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఆ అధికారి నవ్వుతూ జాహ్నవి జీవితం విలువ పరిమితమని వెటకారంగా స్పందించాడు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా అమెరికా పోలీసుల తీరుపై ఆగ్రహం, నిరసనలు చోటు చేసుకున్నాయి. భారత్ కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసిందిజాహ్నవిని కించపరుస్తూ మాట్లాడిన అధికారి డేనియల్ ఆడెరర్‌ను విధుల నుంచి తప్పించారు. వాహనాన్ని నడుపుతున్న అధికారి కెవిన్ దేవ్‌ను కూడా పోలీసు శాఖ తొలగించింది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసినందుకు దోషిగా తేలడమే కాకుండా ₹5,000 జరిమానా విధించారు. అయితే, మరింత తీవ్రమైన క్రిమినల్ అభియోగాలు మోపడానికి కింగ్ కౌంటీ ప్రాసిక్యూటర్లు నిరాకరించారు, అతను ఉద్దేశపూర్వకంగా చేసినట్టు చెప్పలేమని పేర్కొన్నారు. ₹29 మిలియన్ల పరిష్కారంలో సుమారు ₹20 మిలియన్లు నగర బీమా కంపెనీ చెల్లిస్తుందని వివరించారు.ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నుంచి ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికా వెళ్లింది జాహ్నవి. సియాటిల్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చదువుతోంది. 2023 డిసెంబర్‌లో మాస్టర్స్ పూర్తి కావాల్సి ఉంది. ఇంతలోనే 2023 జనవరి 23న జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయింది. ఆమెది సాధారణ కుటుంబం. తల్లి ప్రాథమిక పాఠశాల టీచర్‌గా ఉన్నారు.

## నా కుమార్తెను వ్యభిచారంలో దింపారు

**అమరావతి** రెండేళ్లుగా .. తమ కుమార్తె ను వ్యభిచార కూపం లోకి దించారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో హోం మంత్రి అనితను కలిసి భోరున విలపించారు.తమ కూతుర్ని కాపాడాలని హోమ్ మంత్రి అనితను వేడుకున్నారు. ఏపీ సచివాలయం లో హోమ్ మంత్రి అనిత ను కలసి గోడుగోడున విలపించారు. తిరుపతి కి చెందిన ఈ మహిళ తాను స్థానిక ప్రజా ప్రతినిధులు. పోలీస్ అధికారులు. ఉన్నతాధికారులు ను కలిసి వేడుకున్నా..ఎలాంటి..స్పంద న లేదని ఆరోపించారు.రేపు తనను కలవాలని హోమ్ మంత్రి అనిత ఆమెకు తెలిపారు. దర్యాప్తు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే హోమ్ మంత్రి ని మూడు సార్లు కలిసా న్యాయం జరగలేదని భోరున విలపించారు బాదిత మహిళ

## కొలికపూడికి సీరియస్ వార్నింగ్

**విజయవాడ** రాజకీయాల్లో గెలిచినప్పుడు ఉండే ఉత్సాహం వేరు, కానీ గెలిపించిన పార్టీ గీత దాటినప్పుడు వచ్చే ఇబ్బందులు వేరు. ప్రస్తుతం తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ విషయంలో సరిగా ఇదే జరుగుతోంది. గత కొద్ది రోజులుగా తన ప్రవర్తనతో సోషల్ మీడియా పోస్టులతో పార్టీని, పార్టీ నేతలను ఇరకాటంలో పెడుతున్న కొలికపూడికి టీడీపీ గట్టి షాక్ ఇచ్చింది. అసెంబ్లీ లాబీల్లోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఆయనను పిలిచి క్లాస్ తీసుకున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పల్లా శ్రీనివాసరావు కొలికపూడిని పక్కకు పిలిచి హెచ్చరించారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. మీరు పెట్టే ఆ వాట్సాప్ స్టేటస్‌లు ఏంటీ? ఎవరి మీద మీరు పోరాటం చేస్తున్నారు? పార్టీ క్రమశిక్షణ దాటితే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదు అని పల్లా స్పష్టం చేశారు. అంటే ఎమ్మెల్యేగా గెలిచారు కాబట్టి నేనే పెద్ద లీడర్ అనుకుంటే కుదరదని, పార్టీ గీసిన గీత లోపలే ఉండాలని వార్నింగ్ ఇచ్చారు. కొలికపూడి శ్రీనివాస్ తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆయన వ్యవహార శైలి ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. నియోజకవర్గంలోని సమస్యల మీద, లేదా పార్టీలోని ఇతర నాయకులపై ఆయన పెడుతున్న పోస్టులు పార్టీకి ఇబ్బందిగా మారుతున్నాయి. ఒక ప్రజాప్రతినిధిగా ఉండాల్సిన సంయమనం లేకుండా, బహిరంగ వేదికలపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారుతున్నాయి. పార్టీతో సంబంధం లేకుండా వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటికి కొలికపూడి చెప్పే సమాధానం నేను కొత్తగా ఎమ్మెల్యే అయ్యానని, కొంచెం అనుభవరాహిత్యం వల్ల పొరపాట్లు జరిగి ఉండొచ్చు అని చెబుతున్నారు. సీనియర్లు చెబితే సరి చేసుకుంటాననంటూ సమర్థించుకున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని, కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిని ఉద్దేశించి ఎప్పటికప్పుడు చంద్రబాబు,లోకేష్ సహా సీనియర్లంతా హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. పార్టీలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని చెప్పారు. చేసే పనులు పార్టీలైన్‌లో లేకుంటే అనవసరమైన గొడవలకు దారితీస్తుందని అన్నారు. వ్యక్తిగత అహంకారం ఎప్పుడూ పార్టీ లక్ష్యాల కంటే పెద్దది కాకూడదని కూడా చంద్రబాబు గతంలో హెచ్చరించారు. చంద్రబానే నేరుగా ఒకసారి పిలిచి శ్రీనివాస్‌తో మాట్లాడారు.

అయినా ఆయన తీరులో మార్పు రాలేదు. అయితే ఇప్పుడు కొలికపూడికి ఇచ్చింది చివరి హెచ్చరికని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆయన వైఖరిలో మార్పు రాకుంటే కచ్చితంగా చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

## డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలి

### - కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే డిమాండ్

**బెంగళూరు,** డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ సాగుతోంది. ఈరోజు ఇక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం శివకుమార్ చేసిన కృషికి ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని చాలామంది ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారని అన్నారు.కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 140 మంది ఎమ్మెల్యేలు మార్పును ఆశిస్తున్నారని, 80 నుంచి 90 వరకు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చించుకుంటున్నారని అన్నారు. తామంతా శివకుమార్‌కు మద్దతిస్తున్నామని అన్నారు.ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య వర్గానికి చెందిన వారిగా భావిస్తున్న ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనకు వెళ్లడంపై కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. పార్టీ కర్ణాటక రాష్ట్ర ఇన్‌ఛార్జ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి విదేశీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యేల పేర్లను అడిగినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై జరుగుతోన్న ప్రచారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే ఎమ్మెల్యేల విదేశీ పర్యటనకు వెళ్లారని సిద్ధరామయ్య వర్గం చెబుతోందని తెలుస్తోంది.

## రాజ్ కేసిరెడ్డేకి సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరణ

**గుంటూరు** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కేసిరెడ్డి కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గురువారం జరిగిన విచారణలో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడమే కాకుండా నిందితుడిపై అత్యంత కఠినమైన వ్యాఖ్యలు చేసింది.బెయిల్ పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం రాజ్ కేసిరెడ్డిని ఈ మొత్తం మద్యం కుంభకోణానికి అసలు ఆర్కిటెక్ట్ అని అభివర్ణించింది. ప్రభుత్వ వ్యవస్థలను మేనేజ్ చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరును కోర్టు తప్పుబట్టింది. ఈ కుంభకోణంలో ఆయన పాత్ర అత్యంత కీలకమని, అందుకే ఇప్పుడు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. రాజ్ కేసిరెడ్డి తరపు లాయర్ వాదనలు వినిపిస్తూ, తన క్లయింట్ ఇప్పటికే 10 నెలలుగా జైల్లో ఉన్నారని, కాబట్టి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై ధర్మాసనం ఘాటుగా స్పందించింది. పర్లేదు.. కొన్నాళ్లు జైల్లోనే ఉండనీయండి అని సంచలన వ్యాఖ్యలు చేసింది. జరిగిన కుంభకోణం తీవ్రత దృష్ట్యా మరికొంత కాలం ఆయన జైలులోనే ఉండాలని కోర్టు అభిప్రాయపడింది.ధర్మాసనం బెయిల్ ఇచ్చేందుకు సముఖంగా లేకపోవడంతో పాటు, పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని సంకేతాలు ఇవ్వడంతో రాజ్ కేసిరెడ్డి తరపు న్యాయవాదులు వెనక్కి తగ్గారు. కోర్టు పిటిషన్‌ను కొట్టివేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతో, వారు తమ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు . గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీ పేరుతో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఏపీ సీఐడీ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. రాజ్ కేసిరెడ్డి ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొట్టారని అభియోగాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలతో ఈ కేసులో విచారణ మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో సిట్ 16 మందిని అరెస్టు చేయగా, మొత్తం 48 మందిపై కేసులు నమోదు చేసింది. వీరిలో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి వంటి ప్రముఖులు ఉన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి వంటి వారికి బెయిల్ వచ్చింది. మనీ లాండరింగ్ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేసిన ఈడీ, ఇప్పటికే ఎంపీ మిథున్ రెడ్డిని సుదీర్ఘంగా ప్రశ్నించింది. జనవరి 2026లో మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి కూడా నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. హవాలా మార్గంలో మళ్లించిన నిధులు, షెల్ కంపెనీల ఏర్పాటుపై ఈడీ ప్రస్తుతం లోతుగా ఆరా తీస్తోంది.

## మహాశివరాత్రి ఆహ్వాన పత్రికలు

### - బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు అందించిన నిర్వాకులు



**బద్వేలు** బద్వేల్ నియోజకవర్గంలోని పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ లంకమల్లేశ్వర రామలింగేశ్వర స్వామి వారి మహాశివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను గురువారం బద్వేల్ మాజీ శాసన సభ్యురాలు కె విజయమ్మ బద్వేల్ ఇంచార్జ్ రితిష్ కుమార్ రెడ్డి కు అందజేయడం జరిగిందఆలయ కమిటీ చైర్మన్ బీరం చంద్రశేఖర్ రెడ్డి, బద్వేల్ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బిజీవేముల రామచంద్రారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు కలిసి.. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఇంచార్జ్ రితేష్ రెడ్డి ని స్వయంగా కలిసి ఈ వేడుకలకు రావాల్సిందిగా ప్రేమపూర్వకంగా ఆహ్వానించారు.వచ్చే ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం నాడు జరగనున్న స్వామి వారి కళ్యాణోత్సవం ఇతర విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు

## మండలిని శాసించాలని బొత్స ప్రయత్నించడం హాస్యాస్పదం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,** వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ శాసనమండలిని శాసించాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం మండలిలో రాష్ట్ర అభివృద్ధిపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క కంపెనీని కూడా తీసుకురాలేకపోయిన వైసీపీ నేతలు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తీసుకొస్తుంటే బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.పరిశ్రమలకు భూములే ఇవ్వకపోతే కంపెనీలు ఎలా వస్తాయని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ గణాంకాలతో సహా సమాధానం ఇస్తుంటే, వినే ఓపిక లేక వైసీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.మన దేశానికి వస్తున్న ప్రతి వంద రూపాయల పెట్టుబడిలో 26 రూపాయలు ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని, ఇదే తమ కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అచ్చెన్నాయుడు తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్ర యువతకు ఉద్యోగాలు రావాలన్నా పరిశ్రమల స్థాపన అత్యవసరమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే, భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన వైసీపీ నేతలను హెచ్చరించారు.మండలి నుంచి వైసీపీ వాకౌట్ విశాఖలో ఐటీ కంపెనీలకు 99 పైసలకే భూములు కేటాయించడంపై ఏపీ శాసనమండలిలో వాడీవేడి చర్చ జరిగింది. రియలెస్టేట్ కంపెనీలకు స్థలాలు ఎలా ఇస్తారంటూ వైసీపీ ప్రశ్నించింది. దీనిపై మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు వివరణ ఇచ్చారు. ఏపీకి కంపెనీలు రావడం వైసీపీకి నచ్చదని నారా లోకేశ్ విమర్శించారు. విశాఖలో ఎకో సిస్టమ్ తయారుచేయాలంటే పెద్ద కంపెనీలు రావాలని... అందుకే ఐదు కంపెనీలకు భూములు లీజుకిచ్చామని తెలిపారు. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... ఇతర రాష్ట్రాల్లో కోట్లు పెట్టి కంపెనీలు భూములు కొంటుంటే... విశాఖలో విలువైన భూములను అతి తక్కువ ధరకే అప్పగిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీకి రూ. 5 వేల కోట్ల విలువైన భూములను ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వం భూదోపిడీకి పాల్పడుతోందని బొత్స అన్నారు. గీతంకు భూముల కేటాయింపును నిరసిస్తూ సభ నుంచి వైసీపీ వాకౌట్ చేసింది. అనంతరం నారా లోకేశ్ మాట్లాడుతూ... వైసీపీకి వాకౌట్ చేయడం అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ తలుపు నుంచి వచ్చి ఆ తలుపు నుంచి వెళ్లిపోవడం బొత్స సత్యనారాయణకు అలవాటేనని అన్నారు.

## చెక్ పోస్టు దగ్గర రోడ్డు ప్రమాదం..

# మహిళ మృతి

**తాళ్లరేవు** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం సమీపంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ చెక్పోస్ట్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు మహిళలలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆదే సమయంలో వెనుక నుండి లారీ రావడంతో తలపై నుండి పోవడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు యానాం కు చెందిన తన్వీర్ (20)గా బంధువులు గుర్తించారు. పోలీస్ సిబ్బంది వచ్చి సంఘటన స్థలాన్ని చేరుకొని విచారణ చేపట్టారు. ఇదే తరహాలో తరచూ ఈ భారికేడ్ల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాహన చోదకులు పోలీసులపై మండిపడ్డారు.

## చందర్లపాడులో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా కార్మికుల ర్యాలీ




చందర్లపాడు అలివేలమ్మ గుడి వద్ద నుండి సెంటర్ వరకు కార్మికుల ర్యాలీ నిర్వహించడం జరిగింది..ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు సైదులు మాట్లాడుతూ. కార్మికులు వందేళ్లకు పైగా పోరాటాలు చేసి అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో అమలవుతున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోళ్లను తెచ్చి 2025 నవంబర్ 21 నుండి అమలు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కార్మిక సంఘాలు, కోట్లాదిమంది భారత కార్మిక వర్గం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన పెద్ద ఎత్తున నిరసనలు తెలిపినా ఏమాత్రం పట్టించుకోకుండా కార్పొరేట్ల ఒత్తిడితో ఈ లేబర్ కోడ్స్ అమలుకు పూనుకుంటుంది. అవి కనుక అమలు అయితే పని గంటలు పెరుగుతాయి,సంఘం పెట్టుకునే హక్కు పోతుంది, సమ్మె చేసే హక్కు పోతుంది.

అంతేకాకుండా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంది. ఇప్పటివరకు గ్రామీణ పేదలకు ఉన్న ఉపాధి గ్యారెంటీ పోయింది. వ్యవసాయానికి కనీసం మద్దతు ధరల చట్టం చేయడం లేదు. విద్యుత్ చట్టం విత్తన సవరణ చట్టం తీసుకువచ్చి రైతులకు తీవ్ర నష్టం సేకరిస్తుంది. మరోవైపు ప్రభుత్వ రంగాన్నీ ప్రైవేటీకరణ చేస్తుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈరోజు 25 కోట్ల మంది కార్మికులు కర్షకులు సమ్మెలో పాల్గొంటున్నారని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు గుమ్మల ఏడుకొండలు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుజాత, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాణి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మిడివరంలో కార్మిక సంఘాల భారీ ర్యాలీ

**ముమ్మిడివరం** కార్మిక సంఘాలు పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ముమ్మిడివరం, కాట్రేనికోన, మురమళ్ల గ్రామాల్లో కార్మికులు భారీ ర్యాలీలు, రహదారులపై బైటాయింపు, మానవసరం కార్యక్రమాలు నిర్వహించారు.. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం 26వేలు చెల్లించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి,భవననిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలుచేయాలని,కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి తదితర డిమాండ్లు తో నిరశన కార్యక్రమాలు నిర్వహించారు.. సి. ఐ. టి. యు. ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, భవన నిర్మాణ కార్మికులు, కొబ్బరి వలపు కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు,నగర పంచాయతీ కాంటాక్ట్ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్తెనపల్లి కోర్టుకు అంబటి



**సత్తెనపల్లి** రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి మాజీ మంత్రి అంబటి రాంబాబును పోలీసులు గుంటూరుకు తరలించారు. పట్టాభిపురం ర్యాలీ కేసులో బెయిల్ వచ్చినప్పటికీ, మరో పాత కేసులో అంబటిపై పిటీ వారెంట్ జారీ అయిన విషయం తెలిసిందే. 2023లో సత్తెనపల్లి సంక్రాంతి సంబరాలపై జనసేన నాయకుడు పెట్టిన ప్రైవేట్ కేసులో విచారణ జరుగుతోంది. గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అంబటిని సత్తెనపల్లి పోలీసులు హాజరు పరిచారు. అంబటి గత నెల 31 నుంచి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్లో ఉన్నారు

## పాతకారులో మృతదేహం..



**విజయవాడ:** ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని గుణదలలో ఓ పాత కారులో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గుణదల రామవరప్పాడు రింగ్ నుంచి విజయవాడ వైపునకు వచ్చే రహదారి వెంబడి నిలిపి ఉంచిన పాత కారులో ఓ మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మంగళగిరి ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. గుణదల మేరీమాత తిరునాళ్లకు వచ్చి కారులో నిద్రలోనే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బంగారు నగల కోసం ఉపాధ్యాయురాలుపై కత్తితో దాడి



**గూడూరు** బంగారు నగల కోసం ఓ ఉపాధ్యాయురాలు పై కత్తితో దాడి చేసిన సంఘటన గూడూరు మండలంలోని కందల వద్ద గురువారం చోటుచేసుకుంది. బాలాయపల్లి మండలం గొట్టిపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు హరిత విధులకు గూడూరు నుంచి ఆటోలు ప్రయాణిస్తుంది. గూడూరు మండలం తందల వద్ద నిర్మానుష ప్రదేశంలోకి తీసుకువెళ్లి ఆటోడ్రైవర్ ఆమెపై కత్తితో దాడి చేసి ఒంటిపై ఉన్న నగలతో పరారయ్యాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తీవ్రంగా గాయపడిన హరితను గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటన పై గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్త్రీల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయురాలు సరోజిని నాయుడు

### -నేడు సరోజిని నాయుడు జయంతి -మహిళలందరికీ జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

జాతీయ మహిళా దినోత్సవాన్ని ఫిబ్రవరి 13, దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. స్త్రీల అభ్యున్నతికి కృషిచేసిన సరోజిని నాయుడు జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా పాటిస్తున్నారు. ప్రముఖ స్వతంత్ర సమరయోధురాలు, భారతదేశ తొలి మహిళా గవర్నర్ సరోజినినాయుడు ఫిబ్రవరి 13, 1879న హైదరాబాద్ లో జన్మించారు. ఈ సంవత్సరం సరోజినినాయుడు 147వ జయంతి. హైదరాబాద్ లోని బెంగాలీ బ్రాహ్మణ కుంటుంబంలో ఫిబ్రవరి 13, 1897న ఆమె జన్మించారు. తల్లిదండ్రులు అఘోరనాథ చటోపాధ్యాయ, వరద సుందరీ దేవి. శాస్త్రవేత్త,తత్వవేత్త అయిన అఘోరనాథ చటోపాధ్యాయ హైదరాబాద్‌లో నిజాం కాలేజీ ని స్థాపించి, ప్రిన్స్‌పాల్‌గా చాలా కాలం పనిచేశారు. తల్లి వరద సుందరీ దేవి కవయిత్రి. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేసిన వారిలో సరోజినీనాయుడు ప్రముఖ రాలు. కవిత్వంతో మాధుర్యన్ని కురిపించి నైటింగేల్ ఆఫ్ ఇండియా (భారత కోకిల) గా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారు.ఆమె భారత జాతీయవాద ఉద్యమంలో భాగమైంది. మహాత్మా గాంధీ ఆయన స్వరాజ్య భావనకు అనుచరురాలిగా మారింది. 1930 ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మరియు మదన్ మోహన్ మాలవ్య వంటి ఇతర కాంగ్రెస్ నాయకులతో పాటు ఆమెను అరెస్టు చేశారు. శాసనోల్లంఘన ఉద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రధాన వ్యక్తులలో సరోజిని ఒకరు. ఆ సమయంలో బ్రిటిష్ అధికారులచే ఆమె పదే పదే అరెస్టులను ఎదుర్కొంది మరియు 21 నెలలకు పైగా (1 సంవత్సరం 9 నెలలు) జైలులో గడిపింది. ఆమె 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు మరియు తరువాత 1947లో యునైటెడ్ ప్రావిన్సెస్ గవర్నర్ అయ్యారు, భారతదేశంలో గవర్నర్ పదవిని నిర్వహించిన మొదటి మహిళగా నిలిచారు.ఆమె అనిబెసెంట్ తర్వాత జాతీయ కాంగ్రెస్ పార్టీకి రెండవ మహిళా అధ్యక్షురాలిగా 1925లో ఎన్నికయ్యారు. ఆమె 1928లో దేశంలో ప్లేగ్ వ్యాధి ప్రబలిన కాలంలో చేసిన పనులకు గుర్తింపుగా బ్రిటిష్ ప్రభుత్వం ఖైసేర్ ఏ హింద్ బిరుదును అందించింది.ఆమె 1947 నుండి 1949 వరకు ఆగ్రా మరియు ఔద్ సమైక్య ప్రావిన్సుకు తొలి గవర్నరుగా నియమించబడి, దేశంలో తొలి మహిళాగవర్నర్ గా చరిత్రకెక్కారు.తనే దేశం, దేశమే తనుగా భావించి దేశ సేవ చేసిన అభేద భావాల మూర్తి రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో రకరకాలుగా సేవలు చేసి మానవ సేవ చేయదలుచుకున్న వారికి మార్గాలనేకం అని నిరూపించిన మహితాన్వితురాలు. జీవితమంతా మానవ సేవకు, దేశసేవకూ అంకితము చేసి తన డబ్బై వ యేట 1949 మార్చి 2 వ తేదీన లక్నోలో ప్రశాంతంగా కన్ను మూసింది.సరోజిని నాయుడు కొన్నిరచనలు: ?గోల్డెన్ థ్రెషోల్డ్ అనే మొదటి కావ్య సంకలనాన్ని ఆమె 1905లో ప్రచురించారు.?ది బర్డ్ ఆఫ్ టైం: సాంగ్స్ ఆఫ్ లైఫ్ డెత్ అండ్ ది స్ప్రింగ్,?ది ఇండియన్ వీవర్స్,?ది బాంగిల్



# ఇక అమరావతి ఐటీ రాజధాని



**విజయవాడ,** హైదరాబాద్‌ను హైటెక్ సిటీ పేరుతో ఐటీ హబ్‌గా మార్చినట్టుగానే, ఇప్పుడు అమరావతిని ప్రపంచ దేశాలు అబ్బురపడేలా క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది.ఇది రాష్ట్ర చరిత్రలోనే మైలురాయిగా భావిస్తున్నారు. ఇది కేవలం టెక్ పార్క్ మాత్రమే కాదని రాబోయే తరాల భవిష్యత్‌ను మార్చే విజన్‌గా ప్రభుత్వం అభివర్ణిస్తోంది. మనం వాడుతున్న కంప్యూటర్లు, ఫోన్లు, బిట్స్ ఆధారంగా పని చేస్తాయి. అంటే చిన్నప్పుడు మీరు నేర్చుకున్న ద్విసంఖ్యామానం గుర్తుందా... అంటే ఎంత పెద్ద సంఖ్యలనైనా 0,1 రూపంలో రాయడం. వీటి ఆధారంగానే ఇప్పటి వరకు కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఫోన్ పని చేస్తూ వచ్చాయి. ఇప్పుడు క్వాంటం కంప్యూటర్‌లో అలా కాదు. ఇక్కడ క్యూబిట్స్ ఆధారంగా పని చేస్తాయి. వీటి ప్రత్యేకత ఏంటంటే ఇవి ఒకే సమయంలో 0, 1 రెండూ అవ్వగలవు. దీన్నే సూపర్‌పొజిషన్ అంటారు. దీని వల్ల మామూలు కంప్యూటర్లు కొన్ని ఏళ్లు పని చేసే పనిని, క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. ముఖ్యంగా మందుల తయారీ, వాతావరణ అంచనాలు, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. క్వాంటం కంప్యూటర్ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలతో చేతులు కలిపింది. అమరావతిలో సుమారు యాభై ఎకరాల్లో ఈ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఐబీఎం క్వాంటం సిస్టమ్ 2 అనే భారీ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 156 క్యూబిక్ హెరా ప్రాసెసర్‌ను వాడుతున్నారు. ఇది మన దేశంలోని అతి పెద్ద క్వాంటం కంప్యూటర్ కానుంది. ఈ వ్యాలీ కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు, ఇక్కడ హార్డ్‌వేర్ తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, స్కిల్ ట్రైనింగ్ వంటివన్నీ ఒకే చోట ఉంటాయి. 2029 నాటికి దాదాపు ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### నిరుద్యోగులకు విద్యార్థులకు కలిగే ప్రయోజనం ఏంటీ?

ఈ ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. దాదాపు లక్ష హై స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, యువతకు శిక్షణ కూడా ఇవ్వబోతోంది. వన్ ఎంటర్‌ప్రెన్యూర్ పర్ ఫ్యామిలీ అనే విజన్‌తో సుమారు పది లక్షల మంది యువతకు క్వాంటం స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వాలని ప్లాన్ చేశారు. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో యాభై వేల మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. దీని వల్ల మన రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే భారీ జీతాలతో ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఈ శిక్షణ కొనసాగుతోందని వెల్లడిస్తున్నారు.

### ప్రజల జీవితాల్లో వచ్చే మార్పులేంటి?

2030 నాటికి దాదాపు ఐదు వేల కోట్ల విలువైన ఎగుమతులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి ఇండియాకే క్వాంటం క్యాపిటల్‌గా మారుతుందని చెబుతున్నారు. క్వాంటం కంప్యూటర్ల సహాయంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు త్వరగా మందులు కనుగొనే అవకాశం ఉంది. వాతావరణాన్ని ముందే కచ్చితంగా అంచనా వేయడం ద్వారా రైతులకు పంటల విషయంలో ఎంతో లాభం కలుగుతుందని వివరిస్తున్నారు. ఆనలైన్ మోసాలు అరికట్టేందుకు కూడా సురక్షితమైన వ్యవస్థ తయారవుతుందని తెలుపుతున్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ నాడు హైదరాబాద్‌ను ఐటీ రంగంలో ఎలాగైతే ముందు నిలిపారో, నేడు అమరావతిని డీప్‌టెక్ రంగంలో గ్లోబల్‌లీడర్‌గా చేయాలని చంద్రబాబు కంకణం కట్టుకున్నారని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎవర్నీ ఫాలో అవ్వని అందరికీ దారి చూపిస్తుందని ఇప్పుడు అదే బాటలో ఉందని టీడీపీకి చెందిన సీనియర్ నేత ఒకరు కామెంట్ చేశారు. క్వాంటం టెక్నాలజీ అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ కంప్యూటర్లు వేడెక్కకుండా ఉండటానికి భారీ స్థాయిలో కూలింగ్ సిస్టమ్ అవసరం. అయితే ప్రభుత్వం ఇప్పటికే వీటిన్నింటికీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెబుతోంది. కేంద్రం చేపట్టిన నేషనల్ క్వాంటం మిషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది.

# రాజ్యసభకు చింతకాయల విజయ్

**శ్రీకాకుళం,** ఆంధ్రప్రదేశ్ నుండి జూన్‌లో ఖాళీ కాబోతున్న నాలుగు రాజ్యసభ స్థానాలపై తెలుగుదేశం పార్టీలో అప్పుడే చర్చ మొదలైంది. కూటమి ప్రభుత్వానికి ఉన్న బలం దృష్ట్యా ఈ నాలుగు సీట్లు సులువుగా దక్కే అవకాశం ఉండటంతో, అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు మొదలుపెట్టారు. ఈ రేసులో ప్రస్తుతం టీడీపీ ఐటీ వింగ్ బాధ్యతలు చూస్తున్న యువనేత చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు ఎంపీ సీటు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో బలమైన ప్రచారం సాగుతోంది.టీడీపీకి వెన్నెముకగా ఉండే బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనేది అధిష్టానం ఆలోచన. ఉత్తరాంధ్రలో బలమైన బీసీ నేతగా, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్‌కు మంచి గుర్తింపు ఉంది. ఇప్పటికే అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ స్పీకర్‌గా గౌరవప్రదమైన హోదాలో ఉండగా, ఆయన కుమారుడికి ఢిల్లీ స్థాయిలో అవకాశం కల్పించడం ద్వారా ఉత్తరాంధ్రలోని బీసీలకు పెద్దపీట వేసినట్లు అవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు.గత ప్రభుత్వ హయాంలో టీడీపీ ఐటీ వింగ్‌పై అనేక కేసులు నమోదైనప్పుడు విజయ్ వెనకడుగు వేయకుండా పోరాడారు. పార్టీ సోషల్ మీడియా సైనికులకు అండగా నిలవడమే కాకుండా, ప్రభుత్వంపై నిరంతరం డిజిటల్ అస్త్రాలను సంధించారు. ఈ క్రమంలో ఆయన అనేక రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పార్టీ కోసం ఆయన పడిన కష్టానికి ప్రతిఫలంగా ఈ గౌరవం దక్కాలని మెజారిటీ నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత చంద్రబాబు దృష్టిలో కూడా విజయ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది.

పార్లమెంటులో పార్టీ వాణిని బలంగా వినిపించేందుకు చదువుకున్న, విషయ పరిజ్ఞానం ఉన్న యువతను పంపాలని చంద్రబాబు యోచిస్తున్నారు. విజయ్ విదేశాల్లో చదువుకోవడం, ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండటం, జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి కలిగి ఉండటం ఆయనకు అదనపు అర్హతలుగా మారాయి. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేయడమే కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతు వినిపించగల సత్తా విజయ్‌కు ఉందని పార్టీ పెద్దలు నమ్ముతున్నారు.అదే సమయంలో చింతకాయల విజయ్ అభ్యర్థిత్వానికి ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్ నారా లోకేష్‌తో ఉన్న సాన్నిహిత్యం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, ముఖ్యంగా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఐటీ వింగ్ ద్వారా సోషల్ మీడియాలో పార్టీ గొంతుకను బలంగా వినిపించడంలో విజయ్ కీలక పాత్ర పోషించారు. లోకేష్ వ్యక్తిగత బృందంలో ఒకరిగా ఉంటూ, డిజిటల్ క్యాంపెయినింగ్‌ను విజయవంతంగా నడిపించడమే కాకుండా, పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడంలో తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఈ విధేయతే ఆయనను రేసులో ముందు నిలబెడుతోందని టీడీపీ వర్గాలుచెబుతున్నాయి. ప్రస్తుతానికి అధికారికంగా ఎటువంటి ప్రకటనా రానప్పటికీ, విజయ్ పేరుపై చంద్రబాబు , లోకేష్ ఇప్పటికే ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్లకు, యువతకు మధ్య సమతుల్యత దెబ్బతినకుండా ఈ ఎంపిక ఉండబోతోంది. అన్నీ అనుకూలిస్తే, రాజ్యసభలో టీడీపీ తరపున చింతకాయల విజయ్ అడుగు పెట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపీ పరిస్థితి ఇంత దారుణమా


**గుంటూరు,** ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి.అయితే ఇంతలో కేంద్రం పార్లమెంట్‌లో పెట్టిన ఓ నివేదిక ఇక్కడ రాజకీయ చిచ్చు రేపింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు అప్పుల ఊబిలో ఉన్నాడని చెప్పిన రిపోర్టు సంచలనంగా మారుతోంది. అయితే దీన్ని అధికార ప్రతిపక్షాలు ఇరువురు కూడా బురద చల్లేలా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశానికి వెన్నెముక రైతు అని గర్వంగా చెప్పుకునే రైతు అప్పుల భారతంతో కుంగిపోతున్నాడని పార్లమెంట్‌లో కేంద్రం కీలక నివేదిక బయటపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు కుటుంబాలు దేశంలోనే అత్యధిక అప్పుల భారంతో ఉన్నాయనేది చేదు నిజం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు చూస్తుంటే ఏపీలో రైతు దీనస్థితి ఏంటో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. ఫిబ్రవరి 10న లోక్‌సభలో ఏపీ రైతు అప్పులపై ఒక కీలక చర్చ జరిగింది. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారో దేశానికి స్పష్టమైంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న రైతులతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ రైతుల అప్పులే అత్యధికంగా ఉన్నట్టు తేలింది.

మంత్రి శివరాజ్ సింగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జులై 2018–జూన్ 2019 మధ్య కాలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సగటు రైతు కుటుంబం అప్పు 2,35, 554 రూపాయలుగా ఉంది. ఇది కేవలం ఒక అంచనా మాత్రమే కాదు. ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన వాస్తవం. అంటే మన రాష్ట్రంలో ఒక సాధారణ రైతు కుటుంబం సుమారు రెండు లక్షల ముప్పై ఐదు వేల రూపాయల అప్పుతో కాలం వెళ్లదీస్తోంది.పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం తెలంగాణతో పోల్చి చూసినా ఏపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తెలంగాణలో ఒక రైతు కుటుంబం సగటు అప్పు 1,52, 113రూపాయలుగా ఉంది. అంటే ఏపీ కంటే ఇది చాలా తక్కువ. భారత్‌లో మొత్తం మీద ఒక రైతు కుటుంబం సగటు అప్పు కేవలం 74, 121 రూపాయలు మాత్రమే. జాతీయ సగటు 74వేలు ఉంటే ఏపీలో అది 2.35 లక్షలకు చేరడం ఆందోళనకరంగా ఉంది. దేశ సగటు కంటే ఏపీలో రైతులు దాదాపు మూడు రెట్లు ఎక్కువ అప్పుల్లో ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రి ప్రకటన ద్వారా అప్పుల భారం అయితే తెలిసింది కానీ, సామాన్యంగా రైతుకు ఈ తిప్పలు ఎందుకు వస్తాయో అందరికి తెలిసిందే. పెట్టుబడి పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరిత్యాలు వంటి ఎన్నో కారణాలు రైతును అప్పుల వైపు నెడుతున్నాయి. ఒక్కో రైతు కుటుంబంపై ఇంత భారీ స్థాయిలో అప్పు ఉండటం అనేది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. పార్లమెంట్ సాక్షిగా బయటపడిన ఈ లెక్కలు ఇటు టీడీపీపై వైసీపీ దుమ్మెత్తి పోస్తుంటే, వారి హయాంలోనే ఇలాంటి లెక్కలు వెలుగు చూశాయని అప్పటి ప్రభుత్వం చేతకానితనం వల్లే ఇదంతా జరిగిందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తానికి ఈ కేంద్ర విడుదల చేసిన లెక్కలను ఇరు వర్గాలు వాడుకుంటున్నారు.

### అమెరికాలో రోడ్డు ప్రమాదంలో

# కర్నూలు యువతి మృతి

### - రూ 262 కోట్ల భారీ పరిహారం ప్రకటించిన అధికారులు



**కర్నూలు** అమెరికాలో పోలీస్ అధికారి నిర్లక్ష్యంతో మరణించిన కర్నూలు అమ్మాయి కుటుంబానికి రూ.262 కోట్ల భారీ పరిహారం ప్రకటించారు. 2023 జనవరిలో సియాటెల్లో రోడ్డు దాటుతున్న జాహ్నవి(23) అనే యువతిని పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టింది. తరువాత “ఆమె చనిపోయింది, ఆమె చాలా మాములు మనిషి, 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుందని పోలీసు అధికారులన్నారు.పోలీస్ అధికారి నిర్లక్ష్యంతో మరణించిన జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల భారీ పరిహారాన్ని ఇవ్వనున్నట్లు సియాటెల్ నగర యంత్రాంగం ప్రకటించింది.

## పంట కాలువలోకి దూసుకుపోయిన కారు

### - ఇద్దరికి గాయాలు

**విజయవాడ** కైకలూరు మండలం పల్లెవాడ పంట కాలువలోకి కారు దూసుకు పోయింది. ఘటనలో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. వారిని స్థానికులు బయటికి తీసారు. 108 సహాయంతో కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పశ్చిమ గోదావరి జిల్లా వెంప గ్రామానికి చెందిన తండ్రి కూతురు ఇద్దరూ వైద్య పరీక్షలు నిమిత్తం ఏలూరు హాస్పిటలకి వెళు తుండగా ఘటన చోటు చేసుకుంది.

## మోహినీ అవతారంలో జగన్మోహనాకారుడు

**తిరుపతి,** శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం ఉదయం 8 నుండి 9 గంటల వరకు మోహినీ రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై శ్రీనివాసుడు పల్లకీలో, తిరుచ్చిపై చిన్ని కృష్ణుడు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకీ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, కేరళ కళాకారుల వాయిద్యాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

## తిరుచ్చిపై సోమస్కందమూర్తి

**తిరుపతి, 12 ఫిబ్రవరి 2026** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన గురువారం ఉదయం శ్రీ కామాక్షి సమేత శ్రీ సోమస్కంధమూర్తి తిరుచ్చిపై అనుగ్రహించారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. మహాదేవుడైన కపిలేశ్వరస్వామిని బ్రహ్మోత్సవ వేళ ఈ తిరుచ్చి వాహనంపై దర్శించే భక్తుల కోరికలు నెరవేరతాయని ఐతిహ్యం. అనంతరం అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు.

## నకిలీ గ్రూపుల గుట్టురట్టు 8 మంది సస్పెన్షన్

**పల్నాడు** పల్నాడు జిల్లా మెప్మా విభాగంలో నకిలీ స్వయం సహాయక సంఘాల పేరిట సాగుతున్న భారీ అవినీతి బట్టలు అయింది. లేని గ్రూపులను సృష్టించి బ్యాంక్ రుణాలను కాజేస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మెప్మా పీడీ మురళీకృష్ణ ఎనిమిది మంది సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

## సూట్‌కేస్‌లో యువతి మృతదేహం



పంజాబ్‌లోని బతిండా జిల్లాలో బుధవారం బెహ్మన్ దివానా గ్రామం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఎర్రటి సూట్‌కేస్‌లో సగం కాలిన యువతి మృతదేహం లభ్యమైంది. పొలాల్లో పనిచేస్తున్న వ్యక్తులు సూట్‌కేస్‌ను గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఫోరెన్సిక్ బృందం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి శరీరంపై గాయాల గుర్తులు ఉన్నాయని, ఆమె వయస్సు సుమారు 20 ఏళ్లు ఉండవచ్చని అంచనా వేశారు.

# రాసులపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



జైపూర్ రాసుల్ పల్లి నుండి మంచిర్యాల వెళ్లే దారిలో బైక్ పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులు ప్రమాదానికి గురి కావడం జరిగింది. అందులో ఒకరు మరణించగా ఇద్దరు తీవ్ర గాయాలతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ద

## మహాశివరాత్రి జాతరకు ఏఎంసీ చైర్మన్‌ను ఆహ్వానించిన విలాసాగర్ సర్పంచ్ కనుకయ్య



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలోని ప్రాచీన శ్రీ త్రిలింగ సంగమేశ్వర ఆలయంలో నిర్వహించనున్న జాతర మహోత్సవాలకు హాజరు కావాల్సిందిగా బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్‌ను విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి అందరూ సహకరించాలని కోరుతూ అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు.

## ఉద్యోగులు, కార్మికుల హక్కులు కాలరాస్తున్నారు



అమీర్ పేట్ (ప్రశ్న న్యూస్) కార్మికులను కట్టు బానిసలుగా చేసే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రం బ్రాంచ్ అధ్యక్షుడు రవికుమార్ సంతోజు డిమాండ్ చేశారు. అన్ని ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ( ఎచ్ – 1725) రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు గురువారం నాడు నిర్వహించిన దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పాత లేబర్ చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. అలాగే ఎంతో కాలంగా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్ పై కాలాయాపణ చేస్తు ఉద్యోగుల హక్కులను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే కార్మిక, కర్షక, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. ఇక దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో ప్రధాన డిమాండ్లుపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణమే కార్మిక, కర్షక, ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని కోరారు. ప్రధాన డిమాండ్లలో ముఖ్యంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్ తదితర ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, కనీస పెన్షన్ 9 వేలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వివఏ, ఆర్పీ పథకాల్లో పనిచేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, అలాగే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర రంగాలలో పనిచేసే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నసీర్, యాసిన్, ఖాదర్, అనూరాధ, శ్రవంతి, ఎస్తేర్ రాణి, జుబేదాబేగం, హరిక, రాధికా, రవి, శ్రీధర్, పురుషోత్తం, గంగాధర్, కిషన్, అక్బరి బేగం తదితరులు పాల్గోన్నారు.

## హిందూ సమాజంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే సహించబోం రాష్ట్రీయ వానరసేన

- చిన్న జీయర్ వివాదాస్పద వ్యాఖ్యలపై మలక్ పేట్ పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేసిన రాష్ట్రీయ వానరసేన
- జగద్గురు ఆదిశంకరాచార్యులు స్థాపించిన పీఠాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చరిత్రను వక్రీకరించడం
- అద్వైత సంప్రదాయాలు, స్మార్త పరంపర?, హిందుత్వ మూలాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చరిత్రను వక్రీకరించడమే
- చిన్న జీయర్ పై చట్టపరమైన చర్యలకు డిమాండ్





హైదరాబాద్(ప్రశ్న న్యూస్) హిందూ సమాజంపై జరుగుతున్న విష ప్రచార దాడుల పట్ల హైందవ సమాజం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ వానరసేన సభ్యులు పిలుపునిచ్చారు. ఈనెల 4 వ తేదీన ముచ్చింతల్‌లో చిలకమర్రి శ్రీమన్నారాయణ చార్యులు అలియాస్ చిన్న జీయర్ చేసిన వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని తీవ్రంగా కలతకు గురిచేశాయి. జగద్గురువు శ్రీమద్భగవద్ శంకర భగవత్పాదులు స్థాపించిన పీఠాలైన పూరి, ద్వారక, జ్యోతిర్మఠ, శృంగేరి పీఠాల స్థాపనపై ఆయన చేసిన వ్యాఖ్యలు చారిత్రక వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్రీయ వానరసేన అభిప్రాయపడింది. అద్వైత సంప్రదాయం, స్మార్త పరంపర, హిందుత్వ మూలలు, సంప్రదాయాలపై సందేహాలు ఉత్పన్నమయ్యే వ్యాఖ్యలతో చరిత్రను వక్రీకరించడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేసారు. శంకర భగవత్పాదుల కాల పరిమితిని తక్కువ చేసి చూపించడం, ఆయన స్థాపించిన పీఠాలను ఇతరులవిగా పేర్కొనడం హిందూ ఆధ్యాత్మిక పరంపరను అవమానించడమే అని రాష్ట్రీయ వానరసేన సంస్థ భావిస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు స్థాపించిన పీఠాలపై వివాదాస్పద వ్యాఖ్యలతో హిందుత్వ మూలాలపై దాడికి పాల్పడిన చిన్న జీయర్ పై మలక్ పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ ఫిర్యాదులో పేర్కొన్న విధంగా చట్టపరంగా విచారణ జరిపి, సమాజంలో మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన డిమాండ్ చేస్తోందని అన్నారు. అలాగే భవిష్యత్తులో హిందు సమాజం పట్ల ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, ప్రభుత్వాన్ని రాష్ట్రీయ వానరసేన సంస్థ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# కాప్రా సర్కిల్‌లో వింత వ్యవహారం

### డిప్యూటీ కమిషనర్‌కు సాధారణ గది
### ఇంజనీర్‌కు హైటెక్ కార్యాలయం




కాప్రా (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్‌లో కార్యాలయాల కేటాయింపుపై ఆశ్చర్యకర పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. పరిపాలనా బాధ్యతలు నిర్వహించే డిప్యూటీ కమిషనర్‌కు సాధారణ గది కేటాయించగా, ఇంజనీర్‌కు మాత్రం ఆధునిక సదుపాయాలతో కూడిన హైటెక్ కార్యాలయం ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికారుల ప్రాధాన్యతలు, ఆలోచనా విధానం ఏమిటనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

### గదుల కేటాయింపులో అసమానత.?

సర్కిల్ స్థాయి పరిపాలనలో డిప్యూటీ కమిషనర్ కీలక అధికారి. ప్రజల ఫిర్యాదులు, అభ్యర్థనలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, అన్నీ ఆయన పరిధిలో ఉంటాయి. అలాంటి అధికారికి తగిన స్థాయి కార్యాలయం లేకపోవడం విచిత్రంగా ఉంది. అదే సమయంలో ఇంజనీరింగ్ విభాగాధిపతికి అత్యాధునిక సదుపాయాలతో కార్యాలయం ఏర్పాటు చేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ఉద్యోగుల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు చిన్న గదిని కేటాయించడం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు మొదటి అంతస్తులు కేటాయించిన కార్యాలయం కింద అదే గదిని నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు కేటాయించాలి. మరి ఎందుకు కేటాయించలేదు నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అంటే అంత చులకననా.? ఈఈ కి అంత పెద్ద కార్యాలయం కేటాయించి డిప్యూటీ కమిషనర్ కు చిన్న గదిలి కేటాయించడం ఏమిటో ఉన్నత అధికారులకు తెలియాలి.

### కాప్రా,నాచారం సర్కిళ్ల మధ్య తేడా.?

కాప్రా సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్‌కు సరైన సదుపాయాలతో కార్యాలయం ఉండగా, కొత్తగా ఏర్పాటు అయిన నాచారం సర్కిల్ కు మాత్రం ఎందుకు తేడా.? అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇది ఉన్నత అధికారుల ప్రణాళిక లోపమా. ? లేక ఉద్దేశపూర్వక వ్యవహారమా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కార్యాలయాలే సక్రమంగా లేకపోతే..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సర్కిల్ ల పునర్విభజన తర్వాత అధికారులకు గదుల కేటాయింపులోనే స్పష్టత లేకపోతే, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎంత సమన్వయం ఉంటుందో అనేది ప్రశ్నార్థకంగా మారింది.ప్రజలు తమ సమస్యలు చెప్పేందుకు వచ్చే కార్యాలయం కనీస వసతులు లేకపోతే, ప్రభుత్వంపై విశ్వాసం ఎలా పెరుగుతుంది.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పరిపాలనలో పారదర్శకత అధికారులకు గదుల కేటాయింపు పై స్పష్టమైన ప్రమాణాలు ఉండాలి.అధికారుల హోదా, బాధ్యతల ఆధారంగా సదుపాయాలు ఇవ్వాలి.ఒకే సంస్థలో, ఒకే కార్యాలయంలో ఇలాంటి తేడాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నత అధికారులదే.కాప్రా సర్కిల్ భవనములో ఈ వింత వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, సమగ్ర సమీక్ష చేసి సమానతతో కూడిన కేటాయింపులు చేస్తారా.? లేక ఇదే విధంగా నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్థాయిని అవమానపరిచే విధంగా కొనసాగుతుందా.? అనేది వేచి చూడాలి. మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ పరిధిలో అధికారుల కార్యాలయాల కేటాయింపులే సక్రమంగా లేకపోతే, ప్రజల సమస్యలు ఎలా తీరుతాయి.

## జన సంఘ్ నుండి భాజపా వరకు విద్యాసాగర్ రావు ప్రస్థానం ఆదర్శం

- భాజపా బోయినిపల్లి మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం
- చెన్నమనేని విద్యాసాగర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పరశురాం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం బోయినిపల్లి భాజపా మండలాధ్యక్షులు ఎడపల్లి పరశురాం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాసాగర్ రావుతో సంభాషణ అంటే జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీ వరకు పార్టీ సంపూర్ణ ప్రస్థానాన్ని కళ్లకు కట్టినట్లు చూడటమేనన్నారు. వారి మార్గదర్శకత్వంలో ఎందరో యువకులు నేడు నాయకులుగా ఎదిగారని కొనియాడారు. విద్యాసాగర్ రావు రాజనీతిజ్ఞత, విశాల అవగాహన నేటి తరానికి ఆదర్శమని పరశురాం పేర్కొన్నారు.

## బండారి రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి: బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ప్రజల కోసమే జీవించిన మహానాయకుడు, పీడిత వర్గాల పక్షాన అండగా నిలిచిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బండారి రాజిరెడ్డి సేవామయమైన రాజకీయ ప్రస్థానం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. 79వ జయంతి సందర్భంగా ఉప్పల్ డివిజన్ లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం కృషి చేసిన బండారి రాజిరెడ్డి చూపిన మార్గమే తమకు దారిదీపమని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చైనాలో హఠాత్తుగా కుంగిన రోడ్డు

- సీసీటీవీలో రికార్డైన భారీ గొయ్యి



షాంఘై (ప్రశ్న న్యూస్) చైనాలోని షాంఘై నగరంలో రద్దీగా ఉండే రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయింది. రోడ్డు కుంగి భారీ గొయ్యి ఏర్పడిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. నిత్యం వాహనాలతో బిజీగా ఉండే ఈ రోడ్డు కుంగిపోవడంతో ఈ ప్రభావం సమీపంలోని భవనాలపై కూడా పడింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెత్తటి ఒండ్రు నేలలు, నిత్యం భూగర్భ జలాల వెలికితీత, పెరుగుతున్న పట్టణ నిర్మాణం వంటి కారణాలతో షాంఘై తరుచూ ప్రమాదాల బారిన పడుతోంది. వీటి కారణంగా షాంఘైలో చిన్న చిన్న గుంతలు మొదలు భారీ గోతులు(సింగ్ హోల్స్) ఏర్పడుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుండగా, అక్కడ పదుల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్న సమయంలో రోడ్డు కుంగిపోయినట్లు వీడియోలో కనిపిస్తోంది. మొదట రోడ్డు బీటలు వారి ఆ తర్వాత క్రమంగా భారీ గొయ్యి ఏర్పడింది. భూమి కుంగిపోయిన సమయంలో అక్కడి నిర్మాణ సామాగ్రి అందులో పడిపోయాయి. 2024 జనవరిలో మిన్‌హాంగ్ జిల్లాలో మురుగునీటి పైపు పగిలిపోవడంతో రోడ్డు 10 మీటర్ల మేర కుంగింది. అయితే అప్పుడు కూడా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. 2017-2023 వరకు చైనాలోని భూమి కుంగిపోయిన ఘటనలో ఎన్నో చోటు చేసుకోగా, అందులో 72 శాతానికి పైగా మానవ తప్పిదాల వల్లనే చోటు చేసుకున్నాయి. మౌలిక సదుపాయాలు, నిర్మాణ లోపాల కారణంగా ఈ కుంగుబాట్లు చోటు చేసుకున్నాయి. షాంఘై వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయల భద్రత లోపాలను ఇది ఆందోళన కలిగిస్తోంది.

## పల్నాడులో ఇంటర్ పరీక్షలకు 49 పరీక్ష కేంద్రాలు

- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి లీలావతి వెల్లడి



**నరసరావుపేట** పల్నాడు జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి లీలావతి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. మొత్తం 814 మంది ఇన్విజిలేటర్లను నియమించి పర్యవేక్షణ కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.



# నువ్వే ఉండిపో ఇలా..

అంకిత జాదవ్, రోహిత్ భోగ జంటగా సత్య మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందిన పాటలు 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే'. ఈ పాటలకు కె.కె.రెడ్డి నిర్మాత. రాంబాబు గోసాల రాసిన పాటలను జయంత్ ఆర్యన్ స్వరపరచగా లిప్సిక, అదితి భావరాజు పాడారు. ఈ పాటల రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది.

దర్శకులు సాయిరాజేష్, శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, అషురెడ్డి అతిథులుగా విచ్చేసి శుభాకాంక్షలు అందించారు. తక్కువమంది క్రూతో ఈ పాటలు చిత్రీకరించామని, నిర్మాత కె.కె.రెడ్డి ఇష్టంతో ప్రొడ్యూస్ చేశారని సత్య మాస్టర్ తెలిపారు. యువతను ఈ పాటలు ఆకట్టుకుంటాయని నిర్మాత కె.కె.రెడ్డి నమ్మకంగా చెప్పారు.

## ఫ్యామిలీపై విమర్శలు చేస్తే

# ఊరుకునేదే లేదు

### లావణ్య త్రిపాఠి ఘాటు స్పందన మరోసారి వైరల్



గత ఏడాది జరిగిన 'బ్రహ్మానందం' సినిమా ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి చేసిన సరదా వ్యాఖ్యలు అప్పట్లో సోషల్ మీడియాలో పెద్ద వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. ఇంటికి వెళ్తే "లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉంటాను" అంటూ కుటుంబంలో మహిళల ప్రాధాన్యత గురించి సరదాగా చెప్పిన ఆ వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. ఆ కామెంట్స్ మళ్లీ తాజాగా ట్రెండ్ అయ్యాయి. ముఖ్యంగా రామ్ చరణ్ – – ఉపాసన దంపతులకు బాబు పుట్టిన సందర్భంగా ఆ పాత వీడియోలను తీసుకువచ్చి చిరంజీవిని ట్రోల్ చేయడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మెగా కోడలు, వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి సోషల్ మీడియాలో గట్టిగా స్పందించారు. కుటుంబానికి సంబంధించిన సంతోషకరమైన క్షణాలను కూడా వివాదాస్పదం చేయడం సరికాదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి మహిళలను ఎంత గౌరవంగా చూస్తారో తెలియకుండా విమర్శలు చేయడం బాధాకరమని, ఇతరులను విమర్శించే ముందు వారి వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాలని ట్వీట్ రూపంలో పేర్కొన్నారు. తాజాగా మరోసారి ఈ అంశంపై స్పందించిన లావణ్య "మా కుటుంబం జోలికి ఎవరైనా వస్తే అస్సలు ఊరుకోను" అంటూ స్పష్టం చేశారు. చిరంజీవి తన కుటుంబంలోని మహిళలను, ముఖ్యంగా మనవరాళ్లను ఎంతో ప్రేమగా చూసుకుంటారని, ఆయన వ్యక్తిత్వం గురించి మాట్లాడే వారు ఆయన చేసిన సేవల్లో ఒక్క శాతం కూడా చేయలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆమె చేసిన ఇదిలా ఉండగా పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తున్న తాజా చిత్రం 'సతీ లీలావతి'పై కూడా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో లావణ్య సరసన దేవ్ మోహన్ హీరోగా నటిస్తుండగా తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. మొత్తంగా కుటుంబ గౌరవం విషయంలో లావణ్య త్రిపాఠి తీసుకున్న స్టాండ్ మెగా అభిమానులను ఆకట్టుకుంటుండగా సోషల్ మీడియాలో ఈ అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

## చరిత్ర గుర్తించని

# మహావీరుడి కథ



'మనం ఈ రోజు ఇంత స్వేచ్ఛగా ఉండటం వెనుక ఎంతోమంది త్యాగాలున్నాయి. ఈ విషయంలో అంతా రాజుల గురించి మాట్లాడతారు కానీ, ప్రాణత్యాగాలు చేసిన వారియర్స్ గురించి మాట్లాడరు. వెయ్యేళ్ల క్రితం రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో కృష్ణ అనే వారియర్ ఉండేవాడు. అతడి కథే 'స్వయంభు'. అల్లరిగా తిరిగే ఓ అండర్ డాగ్.. రాజ్యాలను శాసించే స్థాయికి ఎలా చేరాడు అనేది ఇందులో చూపించాం. ఫిక్షన్ ఎలిమెంట్స్ ఉన్నప్పటికీ ఇది నిజంగా జరిగిన కథ' అని హీరో నిఖిల్ అన్నారు. ఆయన వారియర్‌గా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సంయుక్తమీనన్, నభా నటేష్ కథానాయికలు. భరత్ కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా థియేట్రికల్ త్రీడీ ఫార్మాట్ టీజర్‌ని హైదరాబాద్‌లోని ప్రసాద్ఐమాక్స థియేటర్‌లో ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిఖిల్ మాట్లాడారు. 'డైరెక్టర్ భరత్‌కృష్ణమాచారి రీసెర్చ్ చేసి ఈ కథ రాశారు. శ్రద్ధాభక్తులతో అన్ని జాగ్రత్తలూ తీసుకొని 'స్వయంభు' చేశాను. అంతా గర్వపడేలా, సాంకేతికంగా అబ్బురపరిచేలా అంతర్జాతీయ విలువలతో ఈ సినిమా ఉంటుంది. ఈ టీజర్ పరిచయం మాత్రమే. ముందుముందు వచ్చే కంటెంట్‌తో ఆసకికరమైన ఎన్నో అంశాలను పరిచయం చేస్తాం.' అని నిఖిల్ తెలిపారు. శ్రీరాముడికి పరమేశ్వరుడు అందించిన సెంగోల్‌ను స్వాధీనం చేసుకునేందుకు జరిగే భీకర పోరాటమే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తమని టీజర్ ద్వారా దర్శకుడు భరత్‌కృష్ణమాచారి తెలియజేశారు. 98కూణ కాలంలో సాగే ఈ కథలో యుద్ధవీరుడిగా నిఖిల్ అద్భుతంగా నటించారని ఆయన పేర్కొన్నారు. ఇంకా డీఓపీ సెంథిల్‌కుమార్, కథానాయికలు సంయుక్త మీనన్, నభా నటేష్ కూడా మాట్లాడారు.

## మనసుల్ని తాకేలా

# కపుల్ ఫ్రెండ్లీ

'చెన్నై నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథ ఇది. అన్ని వర్గాలూ చూడదగ్గ ఎమోషన్స్ ఇందులో ఉంటాయి. ఈ సినిమా చూసి, నచ్చి డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాను' అని నిర్మాత, పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని అన్నారు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన రొమాంటిక్ లవ్‌స్టోరీ 'కపుల్ ఫ్రెండ్లీ'. మానస వారణాసి కథానాయిక. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందింది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. నిర్మాత ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో ముచ్చటించారు. 'లివ్ ఇన్ రిలేషన్ షిప్ అనేది ఈ సినిమాలో ఓ పదిహేను నిమిషాలు మాత్రమే ఉంటుంది. మిగతా అంతా ప్రేమకథే. హీరో



నెల్లూరు నుంచి చెన్నై వెళ్లి అక్కడ ఇంటీరియర్ డిజైనర్‌గా సెటిలవ్వాలని ప్రయత్నిస్తుంటాడు. హీరోయిన్ చిత్తూరు నుంచి చెన్నై జాబ్ కోసం వస్తుంది. వీరిద్దరూ కలిశాక ఏమైంది అనేది ఈ సినిమా కథ. సంతోష్‌శోభన్ చాలా సెటిల్డ్‌గా చేశాడు. ఈ సినిమాతో సంతోష్‌శోభన్ మంచి స్టార్‌గా ఎదగాలని ఆశిస్తున్నాం' అని కోరారు ధీరజ్ మొగిలినేని. చిత్ర దర్శకుడు అశ్విన్ చంద్రశేఖర్ మనసులు తాకేలా సినిమా తెరకెక్కించారని, పర్‌ఫెక్ట్ స్క్రిప్ట్‌ని ఆయన తయారు చేసుకున్నారని, ఇది యూవీక్రియేషన్స్ నమ్మి చేసిన కథ అని ధీరజ్ మొగిలినేని చెప్పారు. ప్రస్తుతం మా సంస్థపై 'చెన్నై లవ్‌స్టోరీ' చిత్రం రూపొందుతున్నదని, అలాగే సంతోష్ శోభన్ హీరోగా ఓ చిత్రం నిర్మించనున్నామని, కొందరు స్టార్ హీరోలతో స్క్రిప్ట్ డిస్కషన్స్ జరుగుతున్నాయని, ఈ ఏడాది కచ్చితంగా ఓ స్టార్ హీరోతో సినిమా ప్రకటిస్తామని, అలాగే ఓ బాలల చిత్రం కూడా నిర్మిస్తున్నామని, అది ఈ సమ్మర్‌లో విడుదల కానున్నదని ధీరజ్ మొగిలినేని తెలిపారు.

## ఎమోషనల్

# 'సన్ ఆఫ్'



సాయిసింహాద్రి హీరోగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. బత్తుల సతీష్ దర్శకుడు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్, సాంగ్స్ లాంచ్ ఈవెంట్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. రచయిత కోన వెంకట్, దర్శకులు సముద్ర, వి.ఎన్.ఆదిత్య, నిర్మాత రామసత్యనారాయణరాజు, నటుడు, గాయకుడు కుంచె రఘు ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. అందరికీ తప్పక నచ్చే సినిమా ఇదని, కన్నీరు పెట్టుకోకుండా థియేటర్ల నుంచి ఎవరూ బయటకు రారని నిర్మాత, హీరో సాయి సింహాద్రి చెప్పారు. ఇంకా డిస్ట్రిబ్యూటర్ శోభారాణి, హీరోయిన్ మీరా రాజ్, రచయిత భాస్కరభట్ల, మాటల రచయిత లక్ష్మీభూపాల, డీవోపీ కిట్టు, సంగీత దర్శకుడు రిషి కూడా మాట్లాడారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' విలన్ పార్థిబన్ ఫస్ట్ లుక్ రిలీజ్ ..

## పవన్ కళ్యాణ్‌తో పోరు ఎలా ఉంటుందనే ఆసక్తి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ 2026 మార్చి 26న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా పనులు సాగుతున్నాయి. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి విలన్ పాత్రధారి ఫస్ట్ లుక్‌ను చిత్ర బృందం విడుదల చేయడంతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తమిళ నటుడు పార్థిబన్ ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నారు. విడుదల చేసిన క్యారెక్టర్ పోస్టర్‌లో పార్థిబన్ ఎంతో భయానకంగా, పవర్‌ఫుల్ లుక్‌లో దర్శనమిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రంలో ఆయన పోషిస్తున్న పాత్ర పేరు 'నల్ల నాగప్ప'. రాజకీయ నాయకుడి పాత్రలో కనిపించనున్న పార్థిబన్ పాత్ర కథలో కీలకంగా ఉండబోతుందనే సంకేతాలు ఫస్ట్ లుక్ నుంచే స్పష్టమవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ –పార్థిబన్ మధ్య జరిగే ఫేస్ ఆఫ్ సన్నివేశాలను దర్శకుడు హరీష్ శంకర్ ఎలా డిజైన్ చేశారో చూడాలని అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్‌కు మంచి స్పందన లభించగా, త్వరలోనే రెండో పాటను కూడా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కథన రచన బాధ్యతలను దర్శకుడు దశరథ్ నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఆశుతోష్ రాణా,




గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. భారీ తారాగణం, పవర్‌ఫుల్ యాక్షన్ అంశాలు, రాజకీయ బ్యాక్‌డ్రాప్ కలగలిపిన ఈ చిత్రం 2026లో అత్యంత ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా

# రైతుల భాగస్వామ్యంతో పీఆర్ఏ అమలు

**- వ్యవసాయ విద్యార్థుల ఆధ్వర్యంలో పీఆర్ఏ పై అవగాహన**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) గ్రామ సమస్యలు, వనరులు, అవసరాలను గుర్తించేందుకు పీఆర్ఏ (పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్) పద్ధతులపై గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన బీఎస్సీ వ్యవసాయ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కె. అనూష నాయక్, తనజ్జా మహీన్, బి. సుష్మిత, జె. కావ్యలు తమ రావెప్ కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యాట్రిక్స్ ర్యాంకింగ్,చాపతీ పటం, కాలగమన పటం, కాలగమన క్యాలెండర్, వనరుల పటం, సామాజిక పటం వంటి పీఆర్ఏ సాధనాలపై వివరించారు. ఈ పద్ధతులు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని రైతులు తెలిపారు. విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయంపై ప్రత్యక్ష అనుభవం లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, చంద్రగిరి వెంకటేష్, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, గంధ్ర నర్సింగరావు, బుర్ర రాజయెల్లయ్య, పులి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

**- కెడిసిసి బ్యాంక్ మేనేజర్ కె.ఉదయశ్రీ**

మంథని ( ప్రశ్న న్యూస్) లోన్ యాప్, లాటరి, పార్ట్ టైం జాబ్స్, విదేశీ ప్రయాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పాన్ కార్డ్స్ అప్డేట్, ఆదార్ కార్డు లింకేజి పేరుతో మెసేజెస్, ఓటిపిలు రాగానే ఆశపడి ఓపెన్ చేసి మోసపోవద్దని కెడిసిసి బ్యాంక్ మేనేజర్ కె.ఉదయశ్రీ అన్నారు. గురువారం మంథని మండలం కాకర్లపల్లి గ్రామశీలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవహగాహన సదస్సులో కెడిసిసి బ్యాంక్ మేనేజర్ కె.ఉదయశ్రీ మాట్లాడుతూ, గూగుల్ లో లోన్స్ యాప్స్ కోసం సెర్చ్ చేయడం కానీ చేయవద్దని, నేరగాళ్ళు మన అకౌంట్ లో కొంత ముందుగా డబ్బులు జమ చేసి ఆ తదుపరి మన అకౌంట్ లోని డబ్బులను కాజేస్తారని అన్నారు. సైబర్ నేరగాల్లు ఆశ, భయం అనే రెండు అంశాల మీద సైబర్ నేరాలు చేస్తారని, డెబిట్, క్రెడిట్ కార్డులు ఉపయోగించేటప్పుడు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సహకార బ్యాంక్ యందు ఖాతా కలిగిన ప్రతి ఒక్క ఖాతాదారు కేవైసీ వివరాలు సమర్పించాలని కోరారు. అలాగే ప్రతీ ఒక్క రైతుకు పంట ఋణం అందించేందుకు బ్యాంకు ఎల్లప్పుడూ ముందు ఉంటుందని, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఋణ పంపిణి చేస్తున్నామని తెలిపారు. నగదు రహిత లావాదేవీలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. సౌభాగ్య డిపాజిట్ పథకం 333 రోజులకు గాను సాధారణ పౌరులకు 8.0, సీనియర్ సిటిజన్లకు 8.5శాతం వడ్డీ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, అలాగే మహిళలకు ప్రత్యేకంగా 8.50 వడ్డీ సౌకర్యం కల్పిస్తున్నామని, ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సహకార బ్యాంక్, సంఘాల ద్వారా అందిస్తున్న ఋణాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహకార బ్యాంక్ ద్వారా పాడిపశువులు, గొర్రెలు, పండ్లు, ఆయిల్ ఫాం తోటల పెంపకం, పాలీహౌస్లు, పవర్ టిల్లర్స్, గోదాంలకు, ట్రాక్టర్స్, హార్వేస్టర్లు, గోల్డ్ లోన్స్, స్వయం సహాయక సంఘాలకు, గృహ నిర్మాణాలు, కొనుగోళ్లకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు వ్యక్తిగత, విదేశీ విద్యా, మార్టిగేజ్, ఎస్ హెచ్ జి, జెఎల్ జీ, ఇళ్ల రిపేరుకు, ఇంటిరియర్ డెకరేషను, పీఎంఇజిపి, కార్పొరేషన్ ఋణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే సహకార బ్యాంక్ ద్వారా యూపిఐ, ఐఎంపిఎస్, గూగుల్ పే, ఫోన్ పే, ఆన్లైన్ సేవలు ఖాతాదారులకు అందుబాటులో ఉన్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకానికి రూ.436, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకం రూ.20 చెల్లించి ఉపయోగించుకోవాలని ఖాతాదారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కన్నెబోయిన కొమురయ్య, ఉపసర్పంచ్ ఆకుల ప్రత్యూష-సాయికుమార్, నాయకులు మెండె రాజయ్య, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, కెడిసిసి బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సందేబోయిన శ్రీనివాస్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్లు పోతరాజు సతీష్ కుమార్, వసంత, బ్యాంక్ సిబ్బంది పూజిత, మహేందర్, మహేశ్వరి, సాయి, సహకార సంఘం సిబ్బంది దుబ్బాక సదాశివ్,నారమల్ల విద్యాసాగర్, బొద్దుల సమ్మయ్య, పైడాకుల రాకేశ్, గుడేల్లి మధుమోహన్, రాగం అశోక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీతో ధర్నాలో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ .



మంథని ( ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ప్రముఖంగా పాల్గొన్నారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేస్తూ జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వంశీ కృష్ణ మాట్లాడుతూ, దేశ ఆర్థిక మరియు రాజకీయ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు రైతుల సమస్యలపై ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష స్వరాన్ని అణగదొక్కడం సరైంది కాదని, ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ధర్నా స్థలంలో ప్రదర్శించిన బ్యానర్ ద్వారా దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా జరుగుతున్న ఒప్పందాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యకర్తలకు ఉత్సాహం నింపుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు.

# గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

**- వార్డు సభ్యుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి**

**- వార్డు సభ్యుల సేవలకు గౌరవ వేతనం కల్పించాలి**

**- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) వార్డు సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి గౌరవ వేతనం మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ . గ్రామీణ స్థాయిలో ప్రజలకు అత్యంత చేరువగా ఉండి సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని,ప్రజా సేవలో నిరంతరం నిమగ్నమై ఉన్న వార్డు సభ్యుల ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి బత్తిని అనిల్ గౌడ్, రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముక్కంటి ఈశ్వరుడు దేవస్థానంలో ప్రముఖ డ్రమ్స్ కళాకారుడు శివమణి.



శ్రీకాళహస్తి,(ప్రశ్న న్యూస్ ) శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా సంగీత కచేరి ఇచ్చుటకు గాను ప్రముఖ డ్రమ్స్ కళాకారుడు మరియు సంగీత కళాకారుడు శివమణి ఈరోజు శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి విచ్చేసియున్నారు. వారికి ఆలయ అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించి వారికి అంతరాల దర్శనము వేద పండితులు తీర్థప్రసాదాలు ఆశీర్వచనము ఏర్పాటు చేయడమైనది.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఇబ్బంది కాకుండా చూస్తాం



శ్రీకాళహస్తి,( ప్రశ్న న్యూస్ ) శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కి డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ నాలుగవ గేటు కాకుండా మూడవ గేటు దగ్గర విఐపి లకు, టూ వీలర్స్ మేము ఇన్సైడ్ టెంపుల్ గాని ఔట్సైడ్ టెంపుల్ గాని పెట్టుకోవడానికి వాళ్లకు కూడా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ ఎక్కడ సమస్యలు రాకుండా చూసుకోవడం జరుగుతుంది కాబట్టి తగు జాగ్రత్తలు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవడం జరిగింది విఐపిలు ప్రోటోకాల్ వాళ్ళకి మేనేజ్మెంట్ ఇవన్నీ కూడా ఉన్నాయి ఎవరికి కూడా ఇబ్బంది లేకుండా టైం స్లాట్స్ కూడా ఆర్డిఓ ఈవో టైం స్లాట్స్ అనేది పెట్టడం జరిగింది. ప్రతిరోజు ఈవో తో కోఆర్డినేషన్ మీటింగ్ పెట్టుకుంటున్నాము ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచనలు సలహాలు తీసుకుంటున్నాము మేము మీడియా వారితో కూడా సలహాలు తీసుకుంటున్నాము ఏదైనా సమస్య తెలిస్తే మీడియా దృష్టికి వస్తే మాకు సమాచారం ఇవ్వండి మేము దాన్ని చూసుకుంటాము అపోహాలు, రూమర్స్ ఎవరో ఇచ్చిన సమాచారాన్ని గందరగోళం పరిస్థితి లేకుండా అపోహాలు వద్దు మీ ద్వారా వాస్తవాలు రాయండి రాయలసీమలో ఉన్న నాలుగు జిల్లాల నుంచి విజయవాడ నుంచి కూడా పోలీస్ సిబ్బందికి వస్తుంటారు భక్తులతో ఎలా మెలగాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తాము ఎన్ సి.సి, మహిళా పోలీసులు, వాలంటీర్స్ మేము వాళ్ళ సేవల్ని కూడా తీసుకోవడం జరుగుతుంది అన్ని అబ్జర్వేషన్ చేస్తున్నాము చైల్డ్ మ్యారేజ్ కీ సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది నాలుగు మాడా స్ట్రీట్ లో యజమానులకు కమర్షియల్ అసోసియేషన్ వారికి కూడా రిక్వెస్ట్ చేస్తున్నాను రథోత్సవం ఉంటుంది రథోత్సవం రోజు చాలా ఇరుకైన రహదారులు ఉన్నాయి మీరు చాలా మంది ముందుకు వచ్చి ఆక్రమించుకున్నారు ఎమ్మెల్యే చెప్పి ఉన్నారు కలెక్టర్ చెప్పి ఉన్నారు మున్సిపల్ అథారిటీ వారికి ఆర్ అండ్ బి అధికారులకు కూడా చెప్పడం జరిగింది. ముందుకు వచ్చి ఉంటే వెనక్కి వెళ్ళండి ప్రజలకు సౌకర్యంగా ఉంచడానికి రోడ్లు ఉండాల్సిన బాధ్యత అందరి మీద ఉంది ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది పోలీసులకు సహకరించండి వృద్ధులకి , వెహికల్ లో సూపర్ బజార్ వరకు వచ్చి వారిని వదిలేసి తిరిగి పార్కింగ్ ఏరియాకు వెళ్లిపోవాలి లేదంటే పోలీసు వాళ్ళు మీ మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మీడియా వాళు ళ్ళ పోలీస్ అధికారులు కోరారు టోల్ ఫ్రీ నెంబర్ 2240 ఉన్నది మీడియా సోదరులకు పోలీసు అధికారులు తెలియజేశారు గిరి ప్రదక్షిణ రోజు ఫోర్ వీలర్స్ ,టూ వీలర్స్ లో భక్తులు రాకూడదు.ఫోర్ వీలర్స్, టూ వీలర్స్ మీద ఏవైతే వస్తే వాళ్ల మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుంది అని హెచ్చరించారు హెవి వెహికల్స్ ఏపీ సీడ్స్ దగ్గర, పార్కింగ్ ఏర్పాటు చేశారు మహా శివరాత్రి రోజున సుమారు లక్ష మంది భక్తులు వస్తారని డీఎస్పీ నరసింహమూర్తి ఇటు వన్ టౌన్ సిఐ 2 టౌన్ సిఐ తొట్టంబేడు సిఐ బుచ్చినాయుడు కండ్రిగ సిఐ ఎస్ఐలు సిబ్బందులు పాల్గొన్నారు మీడియా వారికి తెలియజేశారు.

# ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో శ్రీకాళహస్తి సమస్యలపై బొజ్జల సుధీర్ రెడ్డి గళం



శ్రీకాళహస్తి, (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.శ్రీకాళహస్తి పట్టణానికి సంబంధించిన కీలక సమస్యలపై బలంగా గళం విప్పారు.ముఖ్యంగా మూడు ప్రధాన అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.మొదటగా, శ్రీకాళహస్తిని టెంపుల్ సిటీ గా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రతిరోజూ తిరుమలకి విచ్చేసే భక్తుల్లో సగం మంది శ్రీకాళహస్తి దర్శనార్థం వస్తున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, దీనికి శాశ్వత పరిష్కారంగా ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేశారు. రెండవ అంశంగా, శ్రీకాళహస్తి ఆలయంలో సుమారు 1100 మంది కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. వారికి న్యాయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే తిరుమల, శ్రీశైలం వంటి దేవాలయాలు ఆసుపత్రులను నిర్వహిస్తున్న విధానాన్ని ఉదాహరణగా చూపుతూ, శ్రీకాళహస్తిలో ఉన్న ఏడు ఎకరాల విస్తీర్ణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆలయంతో అనుసంధానం చేసి అభివృద్ధి చేయాలని సూచించారు.ఆలయ ఆదాయంతో ఆసుపత్రిని అభివృద్ధి చేస్తే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని అభిప్రాయపడ్డారు.మూడవ అంశంగా, 22ఏ చట్టం కారణంగా పేదలు, రైతులు, పట్టాదారులు తమ సొంత భూములపై హక్కులు వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత పాలనలో తీసుకున్న నిర్ణయాల వల్ల నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. 22ఏ చట్టాన్ని సవరించి, అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రిని కోరారు. శ్రీకాళహస్తి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న దృఢ సంకల్పంతో అసెంబ్లీలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గట్టిగా గళం విప్పడం గమనార్హం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

**ఓట్ల లెక్కింపు సందర్భంగా విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధశీ**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సిరిసిల్ల, వేములవాడలలో ఏర్పాటు చేసిన కౌటింగ్ కేంద్రాల వద్ద 250 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. మున్సిపల్ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా163 ( బిఎన్ఎస్ ఎస్) (144 సెక్షన్ అమలు) అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులో ఉందని ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం,గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు నిర్వహించడం, డీజే కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టపాకాయలు కాల్చడం, భారీగా గుంపులు, గుంపులుగా గుమి కూడటం, ఫంక్షన్ హాల్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని,ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని ఎస్పీ తెలిపారు.

# బండారి రాజిరెడ్డి సేవలు మరువలేనివి

**- బోసాని పవన్ కుమార్**

**బండారి రాజిరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం**

**నేటి యువతకు రాజకీయ దారి చూపిన మహానేత**




ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ప్రజల కోసమే జీవించిన మహానాయకుడు, పీడిత వర్గాల పక్షాన అండగా నిలిచిన ఉప్పల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు స్వర్గీయ బండారి రాజిరెడ్డి సేవామయమైన రాజకీయ ప్రస్థానం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందని బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నాయకులు బోసాని పవన్ కుమార్ అన్నారు. దివంగత నేత ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి 79 వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బోసాని పవన్ కుమార్ ఆధ్వర్యంలో రామంతపూర్ ప్రభుత్వ పాఠశాలో విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్ లు పంపిణీ చేశారు.స్వర్గీయ బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం కృషి చేసిన బండారి రాజిరెడ్డి చూపిన మార్గంలోనే పయనిస్తున్నామని, యువత రాజకీయాల్లో రావాలని, యువతను రాజకీయంగా బలోపేతం చేసిన మహా నేత బండారి రాజిరెడ్డి అని ఈ సందర్భంగా అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, దయాకర్ రెడ్డి,మహేందర్ ముదిరాజ్,గణేష్ యాదవ్, ప్రశాంత్ గౌడ్,ఆనంద్ యాదవ్,టోనీ రాపోల్, శ్రీను,మల్లేష్,ఆకాశ్, సునీల్, ఇమిడి సతీష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కావాడిగూడ సర్కిల్లో అవినీతిదే పై చేయి

**టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి కిష్టయ్య పై తీవ్ర ఆరోపణలు**

**అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎక్కడ.?**





ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతుంటే(పాత ముషీరాబాద్ సర్కిల్) కావాడిగూడ సర్కిల్ పరిధిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి కిష్టయ్య వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎక్కడ.?

కావాడిగూడ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా అంతస్తులపై అంతస్తులు కట్టేస్తున్నారని, సెట్బ్యాక్‌లు పాటించకుండా, రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు, అక్రమ సెల్లార్లు, అక్రమ అంతస్తులు విచ్చలవిడిగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పత్రికలలో కథనాలు వచ్చిన డిప్యూటీ కమిషనర్ ఎసిపి సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య స్పందించకపోవడం చర్యలు తీసుకోకపోవడం వెనక లంచాలే కారణమని స్థానికులకు విమర్శిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా, ఫొటోలు, ఆధారాలు ఇచ్చినా అధికారుల నుంచి స్పందన లేదని ఆరోపిస్తున్నారు.“నోటీసులు ఇస్తామని చెబుతారు. కానీ ఇచ్చిన నోటీసులపై అమలు లేదు. నిర్మాణ పనులు ఆగవు, అధికారులు మాత్రం నిర్మాణ పనులు ఆపామని తప్పుడు సమాచారం ఇస్తారు ఎందుకంటే లంచాలు తీసుకున్నారు కాబట్టి. ఎన్ని ఫిర్యాదులు చేసినా పని మాత్రం ఆగదు రాత్రింబవళ్లు యదేచ్ఛగా సాగుతుంది అని కాలనీవాసులు వాపోతున్నారు.

### సెక్షన్ అధికారి కిష్టయ్య బాధ్యత ఎక్కడ.?

టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి కిష్టయ్యకు అక్రమ నిర్మాణాలపై నిఘా పెట్టడం, నోటీసులు జారీ చేయడం, అవసరమైతే కూల్చివేతలు చేపట్టడం బాధ్యత. కానీ “నోటీసులు ఇచ్చాం, చర్యలు తీసుకుంటాం” అనే మాటలకే పరిమితమవుతున్నారని విమర్శలు ఉన్నాయి. గతంలో ముషీరాబాద్ సర్కిల్ గా ఉన్నప్పుడు సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య వాళ్లతో చేతులు కలిపి భారీగా లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి దానితో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కవాడిగూడా సర్కిల్ కావడంతో అక్కడికి ఏసీపీ డిప్యూటీ కమిషనర్ కొత్తగా రావడంతో గతంలో జరిగిన అక్రమ నిర్మాణాలపై వాళ్లకు ఎలాంటి అవగాహన లేదు దానితో సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహారం సాగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### విధులు నిర్వహించకుండా నిర్లక్ష్యం ఎందుకు.?

అక్రమ నిర్మాణాలపై వెంటనే స్పందించాల్సిన చోట కాలక్షేపం ఎందుకు.? నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూసే విధానం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటి.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అధికారుల
లంచాల ఆరోపణలపై విచారణ ఉండదా.?

స్థానిక ప్రజల ఆరోపణల ప్రకారం, అక్రమ నిర్మాణదారులతో లంచాలు తీసుకొని చర్చలు జరిపి ‘సర్దుబాట్లు’ చేసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లంచాలు తీసుకొని మౌనంగా ఉంటున్నారా.? అనే సందేహాలు బలపడుతున్నాయి.

ఒకవైపు ప్రభుత్వం ఆదాయం పెంచాలని చూస్తుంటే, మరోవైపు అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు సాగిపోతే జిహెచ్ఎంసి ఆదాయానికి గండికాదా.? ప్రభుత్వానికి రావలసిన ప్లాన్ ఫీజులు ఇతర చార్జీలు కోల్పోతే నష్టాన్ని ఎవరు భరిస్తారు.

### ఉన్నతాధికారుల మౌనం ఎందుకు.?

టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది, అధికారుల స్థాయిలోనే ఇలాంటి అవినీతి ఆరోపణలు వస్తున్నప్పుడు, సర్కిల్ డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్, జోనల్ సిపి, ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నారు.?

వారికి సమాచారం లేదా.? లేక సమాచారం ఉన్నా చోద్యం చూస్తున్నారా.? లేదా ఈ వ్యవహారంలో వాళ్లకు వాటాలు ఉన్నాయనే అనుమానాలు నిజమేనా.? అన్న ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

కావాడిగూడ సర్కిల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులచే సమగ్ర విచారణ చేయాలి.

బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తప్పు నిరూపితమైతే సస్పెన్షన్ వంటి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన ప్రజలకు రక్షణ కల్పించాలి.



ఆన్‌లైన్‌లో ప్రతి నిర్మాణ అనుమతిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

### రేవంత్ ప్రభుత్వం స్పందిస్తుందా.?

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మున్సిపల్ శాఖలో భారీగా అవినీతి పెరిగిందనే ఆరోపణలు ఇటీవల తరచూ వినిపిస్తున్నాయి. కావాడిగూడ సర్కిల్ వ్యవహారం


ప్రజాప్రశ్న

బీజేపీ కార్పొరేటర్ కనుసైగల్లో

అక్రమ నిర్మాణాల రాజ్యం

కూడా అదే దిశగా ఉంది అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్లు అక్రమాలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఇది. లేదంటే మున్సిపల్ అంటేనే అవినీతి రాజ్యం” అనే ముద్ర మరింత బలపడే ప్రమాదం ఉంది.

### కావాడిగూడ సర్కిల్ లో నిజంగా ఏమి జరుగుతోంది.?

టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలకు ఉన్నత అధికారుల చర్యలు ఎప్పుడు.? అవినీతి అధికారులకు
ప్రభుత్వం కళ్లెం వేస్తుందా.? లేక ఇదే అవినీతి పాలన కొనసాగుతుందా వేచి చూడాలి.

## సీఎం చంద్రబాబునుకలిసిన బండ్ల గణేశ్

**- మొక్కు చెల్లించుకున్న అనంతరం సీఎంకు శ్రీవారి ప్రసాదం అందజేత**



అమరావతి (ప్రశ్న న్యూస్) సినీ నిర్మాత బండ్ల గణేశ్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తాను మొక్కుకున్న మొక్కును ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి చెల్లించుకున్న నేపథ్యంలో, ఈ భేటీ జరిగింది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్, ఆయనకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు బండ్ల గణేశ్ ఒక సంకల్పం తీసుకున్నారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై, తిరిగి ముఖ్యమంత్రి అయితే తిరుమలకు నడిచి వస్తానని మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు నాలుగోసారి సీఎం కావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు.ఈ క్రమంలో ‘సంకల్ప యాత్ర’ పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు 535 కిలోమీటర్లు నడిచి, ఫిబ్రవరి 10న తిరుమల చేరుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నేడు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ ను ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. పాదయాత్ర సాగిన తీరును, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని బండ్ల గణేశ్ ముఖ్యమంత్రికి వివరించారు.

## తెలంగాణ పంచాయతీలకు శుభవార్త

**- కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది. ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి

# షామీర్ పేట లో అక్రమ రేషన్ బియ్యం దందా

- ప్రభుత్వ పథకాలపై మాఫియా కత్తి సివిల్ సప్లై, పోలీసుల దాడులు ఉండవా.?
- అధికారుల కనుసైగల్లోనే రేషన్ బియ్యం అక్రమ సరఫరా
- కిందిస్థాయిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేదా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ ఓఆర్ఆర్ చుట్టుపక్కల గోడౌన్లు ఏర్పాటు చేసుకొని అక్రమ రేషన్ దందా ను కేటుగాళ్లు యదేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ప్రతి నెల ఒకటవ తారీకు నుండి ప్రారంభమై దాదాపు 20 తారీకు వరకు ఈ మాఫియా తన వ్యవహారాన్ని నిర్వహిస్తుంది.

షామీర్పేట్ మండలంలో పేదల కోసం కేటాయించిన రేషన్ బియ్యం పథకం మాఫియా చేతుల్లోకి జారిపోతుందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీతో పంపిణీ చేయాల్సిన బియ్యం రహదారులపై ఆటోలలో, డీసీఎంలలో బహిరంగంగా తరలించబడుతుండటం స్థానికుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. ఇది పేదల అన్నం.. కానీ మాఫియాకు ఆదాయ వనరు అవుతోంది.. అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రహదారులపై బహిరంగ రవాణా..

షామీర్పేట్, పెద్ద అంబర్పేట్, శంషాబాద్ ప్రధాన రహదారులు, కాలనీలలో తెల్లవారుజామున లేదా రాత్రివేళల్లో ఆటోలలో రేషన్ బియ్యం బస్తాలు నిలువుగా తరలిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొందరు వీడియోలు కూడా తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నప్పటికీ, పోలీసులు, సివిల్ సప్లై అధికారులు పెద్దగా చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ డీలర్ల నుంచి లీకవుతున్న బియ్యం మధ్యవర్తుల చేతుల మీదుగా ఇతర జిల్లాలకు, కొన్నిసార్లు రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సివిల్ సప్లై, పోలీస్ అధికారులపై అనుమానాలు

ఇంత బహిరంగంగా రవాణా జరుగుతుంటే స్థానిక సివిల్ సప్లై అధికారులకు, స్థానిక పోలీసులకు, ఎస్ఓటి పోలీసులకు సమాచారం లేకపోవడం ఎలా.? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కొందరు అధికారుల మౌనం



వెనుక లంచాల ముసుగుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మాఫియా సభ్యులకు పోలీసులు అంటే లెక్కలేదు మామూలు ఇచ్చి మేనేజ్ చేస్తామని ధైర్యం ఉందని కొన్ని సందర్భాలలో స్థానికులు రిపోర్టర్లు పట్టుకుంటే మాఫియా సభ్యులే పోలీసులను పిలిపించి తిరిగి రిపోర్టర్లను స్థానికులను బెదిరించి వాళ్లపై కేసులు పెట్టిన సందర్భాల్లో ఉన్న ఆరోపణలు ఉన్నాయి. అంటే ఈ మాఫియా చేతులలో అధికారి యంత్రాంగం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకోవడానికి సివిల్ సప్లై దళాలు, టాస్క్ ఫోర్స్ బృందాలు ఉన్నప్పటికీ, తరచూ దాడులు జరగకపోవడం, దొరికినప్పుడు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి వదిలివేయడం విమర్శలకు కారణమవుతోంది. కొంతమంది మాఫియా సభ్యులు మహా అంటే కేసు పెడతారు అంతేగా అంటూ స్థానికులను బెదిరింపులకు గురి చేస్తున్నారు అంటే పోలీసులు అక్రమార్కుల పై ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఉన్నత అధికారులే అర్థం చేసుకోవాలి.

### ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

సివిల్ సప్లై జిల్లా స్థాయి అధికారులు కఠినంగా పర్యవేక్షిస్తే ఇలాంటి అక్రమాలు జరగవని ప్రజలు అంటున్నారు. గోదాముల నుంచి డీలర్లకు బియ్యం చేరే వరకు ట్రాకింగ్ వ్యవస్థ బలహీనంగా ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా ఉన్న సివిల్ సప్లై అధికారులు రేషన్ షాపులపై సరైన నిఘా ఏర్పాటు చేయకపోవడం, కొంతమంది అధికారులు నెలనెల మామూళ్లకు ఆశపడి ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకపోవడం జరుగుతుందని జీపీఎస్ మానిటరింగ్, స్టాక్ ఆడిట్లు, అకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా జరగకపోతే ఈ దందా ఆగదని నిపుణులు చెబుతున్నారు.

### ప్రభుత్వ పథకాలపై పేదల హక్కులపై దాడి..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరుగుతున్న
రేషన్ బియ్యం దందా అనేది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు, ఇది పేదల హక్కులపై నేరుగా దాడి అని అర్హులైన కుటుంబాలకు సరిపడా బియ్యం అందకపోవడం వల్ల వారిపై భారం పడుతోంది. రేషన్ డీలర్లు ప్రజల నుండి కొనుగోలు చేసి పక్కదారి పట్టించడం, ఇంటి దగ్గరికి ఆటోలలో వచ్చి బియ్యం కొనుగోలు చేయడం, కాలనీ బస్తీలలో గోడౌన్లు ఏర్పాటు చేసి దాచడం, రాత్రి సమయంలో నగర శివారులకు తరలించడం అంతా బహిరంగంగానే జరుగుతున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. ఒక వైపు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి సంక్షేమ పథకాలు అమలు



చేస్తుంటే, మరోవైపు కొందరి స్వార్థం వల్ల అవి పక్కదారి పడుతున్నాయి.

### ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్

షామీర్ పేట, ఓ ఆర్ ఆర్ చుట్టుపక్కల ఉన్న పోలీస్ స్టేషన్ ల పరిధిలో దర్జాగా జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం రవాణాపై సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.రాత్రివేళల్లో ప్రత్యేక తనిఖీలు,అవినీతి అధికారులపై సస్పెన్షన్, క్రిమినల్ కేసులుప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పథకాలు మాఫియా చేతుల్లోకి వెళ్లకుండా సివిల్ సప్లై శాఖ, పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588